నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 6-3-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 189 | పేజీలు: 4 | వెల: రూ.1/-

కరోనాపై నెగిటివ్ ప్రచారమే ఎక్కువ

రాష్ట్ర ప్రజలెవరికీ వైరస్ సోకలేదు ఈటెల

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై నెగిటివ్ ప్రచారం ఎక్కువగా జరుగుతోందని వైద్ ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డులో వసతులు సరిగా లేవని జూనియర్ డాక్టర్లు చెప్పినట్లుగా ప్రచారం జరుగుతోందన్నారు. వైద్య సిబ్బందికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. డాక్టర్లే మాస్క్‌లు వేసుకుని తిరుగుతే జనాల్లో ఇంకా భయం పెరుగుతుందన్నారు. తెలంగాణలో నివసిస్తున్నవారికి కరోనా సోకలేదని అన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన వారికే వైరస్ వచ్చిందన్నారు. ప్రజలకు పారామెడికల్ సిబ్బంది అవగాహన కల్పించాలని ఈటల రాజేందర్ సూచించారు.

దేశంలో 29 కరోనా పాజిటివ్ కేసులు

పరిస్థితిని నిత్యం సమీక్షిస్తున్నాం
రాజ్యసభలో కేంద్ర మంత్రి హర్షవర్ధన్

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై గురువారం రాజ్యసభలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ప్రకటన చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు చేయకముందే.. కేంద్ర ప్రభుత్వం వైరస్ నియంత్రణకు అన్ని ఏర్పాటు చేసిందన్నారు. మార్చి 4 వ తేదీ వరకు దేశంలో 29 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి రోజూ పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు మంత్రి చెప్పారు. మంత్రుల బృందం కూడా ఎప్పటికప్పుడు కరోనా పరిస్థితిపై సమీక్ష నిర్వహిస్తుందన్నారు. అంతర్జాతీయ ప్రయాణికుల స్క్రీనింగ్ ఇక నుంచి కచ్చితంగా చేపట్టనున్నట్లు తెలిపారు. సుమారు 29 వేల మందిని మానిటర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా భారతీయులు భయపడాల్సిన అవసరం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్త రీజనల్ ఎర్జెన్సీస్ డైరెక్టర్ రోడ్రికో ఓఫ్రిన్ చెప్పారు. ఇప్పటి వరకు కరోనా సోకిన వారిలో ఎక్కువ మంది విదేశాల నుంచి వచ్చినవాళ్లేనని అన్నారు. భారత ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని, భారీ సంఖ్యలో ఐసోలేషన్ వార్డులను సిద్ధంగా ఉంచిందని చెప్పారాయన. అయితే తక్షణంచేయాల్సిందల్లా కరోనా వైరస్ వ్యాప్తి ఎక్కువైతే ట్రీట్మెంట్ ఇచ్చేందుకు డాక్టర్లు, నర్సులు అందుబాటులో ఉండేలా చూసుకోవడమేనని అన్నారు రోడ్రిక్. అందుకోసం భారీ సంఖ్యలో డాక్టర్లు, నర్సులకు ట్రైనింగ్ ఇవ్వాలని అన్నారు. భారత్ లో కరోనా వైరస్ వ్యాప్తి గురించి మాట్లాడిన రోడ్రికో ప్రజల్లో అవగాహన మరింత పెరగాలన్నారు. వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా జాగ్రత్తపడాలని, ఎవరైనా విదేశాల నుంచి వస్తే.. లక్షణాలేవీ లేకున్నా14 రోజుల పాటు ఇతరులను కలవకుండా ఇంట్లోనే సెల్ఫ్ క్వారంటైన్ పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోజులో తరచూ చేతులను సబ్బు లేదా ఆల్కహాల్ బేస్డ్ హ్యాండ్ వాష్ తో శుభ్రం చేసుకోవాలని చెప్పారు రోడ్రిక్. సాధారణ జలుబు, దగ్గు ఉన్నా తప్పనిసరిగా మాస్క్ పెట్టుకోవాలని, ఏమాత్రం అనుమానం ఉన్నా ఆలస్యం చేయకుండా డాక్టర్ ని కలవాలని సూచించారు. ముఖ్యంగా ముసలివాళ్లు, చిన్నపిల్లలకు వైరస్ సోకే ముప్పు ఎక్కువని, వారి విషయంలో మరింత శ్రద్ధ అవసరమని చెప్పారు. అయితే ఎండలు పెరిగే కొద్దీ వైరస్ ప్రభావం తగ్గుతుందన్న దానిపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయని, ప్రస్తుతానికి ఎటువంటి శాస్త్రీయ నిర్ధారణ కాలేదని రోడ్రిక్ అన్నారు.

దుబాయ్‌లో భారతీయ విద్యార్థికి కరోనా

దుబాయ్‌లోని ఒక భారతీయ విద్యార్థి (16)కి కరోనా వైరస్ సోకినట్టు నిర్ధారణ అయింది. విదేశాలకు వెళ్ళిన విద్యార్థి తల్లిదండ్రుల నుంచి అతనికి ఇన్‌ఫెక్షన్ సోకిందని గల్ఫ్ న్యూస్ గురువారం దుబాయ్ హెల్త్ అథారిటీ (డిహెచ్ఎ) ను ఉటంకిస్తూ పేర్కొంది. దీంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మొత్తం కరోనా బాధిత కేసుల సంఖ్య 27 కి చేరిందని ఆరోగ్య శాఖ అధికారులు ప్రకటించారు. విదేశాలకు వెళ్లిన దుబాయ్‌కు తిరిగి వచ్చిన ఐదు రోజుల తరువాత బాధిత విద్యార్థి తల్లిదండ్రులు కరోనా వైరస్ లక్షణాలతో బాధ్దారు. దీంతో మొత్తం కుటుంబాన్ని క్వారంటైన్ చేసిన ఆరోగ్య అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో విద్యార్థికి పాజిటివ్ రాగా, మిగిలి కుటుంబ సభ్యులు కోలుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా గురువారం నుంచి స్కూలు మూసివేస్తున్నట్టు ఇండియన్ హై గ్రూప్ ఆఫ్ స్కూ ప్రకటించింది. పాఠశాల విద్యార్థులు, సిబ్బందికి డిహెచ్ఎ అధికారులు క్షుణ్ణంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అధికారుల తీరుపై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ విషయంలో హైకోర్టులో దాఖలైన పిల్‌పై గురువారం నాడు విచారణ జరిగింది. సుమారు రెండు గంటలపాటు జరిగిన ఈ విచారణలో అధికారుల పనితీరు తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కరోనాను ఎదుర్కొనేందుకు

కమిటీలు నియమించామని.. మురికివాడలో ఆయాలు, హెల్త్ వర్కర్లను నియమించామని కోర్టుకు అధికారులు తెలిపారు. సిబ్బందికి ఉచితంగా మాస్కులు అందిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది.

బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో స్క్రీనింగ్ సౌకర్యాన్ని కల్పించాలని.. అంతేకాకుండా ఉచితంగా మందులు, మాస్కులు అందజేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 12కు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. కరోనాపై రివ్యూ చేస్తామని ధర్మాసనం తెలిపింది. కేరళకు పది మందితో కూడిన వైద్యుల బృందం వెళుతుందని కోర్టుకు.. వైద్యాధికారులు వివరించారు. కాగా.. హైదరాబాద్‌లో తొలి కరోనా కేసు నమోదైన సంగతి తెలిసిందే.

కరోనా జన్యుక్రమాన్ని గుర్తించాం

ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ లేదా కోవిడ్19 వ్యాధికి ఎనిమిది వారాలు నిండాయి. ప్రాణాంతకంగా మారిన కరోనా వైరస్ చైనాలోని వుహాన్ సిటీ నుంచి ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న విషయం తెలిసిందే. ఈ వైరస్‌కు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఓ కీలక ప్రకటన చేసింది. కరోనా వైరస్‌కు సంబంధించిన జన్యు క్రమాన్ని గుర్తించినట్లు డబ్ల్యూహెచ్‌వో హెల్త్ ఎమ్జర్జెన్సీ ప్రోగ్రామ్‌లో టెక్నికల్ లీడ్‌గా పనిచేస్తున్న డాక్టర్ మారియా వాన్ కెర్కోవ్ తెలిపారు. ఈ అంశంపై ఆమె మీడియాతో మాట్లాడారు. వైరస్‌కు సంబంధించిన జెనటిక్ విశ్లేషణ జరుగుతోందన్నారు. పాలీమిరేజ్ చైన్ రియాక్షన్(పీసీఆర్)తో పాటు సీరాలిజికల్ విశ్లేషణను పరిశోధన శాలలో నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. కొత్త వ్యాధిగా రూపాంతరం చెందిన కరోనా వైరస్‌కు సంబంధించి కావాల్సినంత సమాచారం తమ దగ్గర ఉందని కెర్కోవ్ చెప్పారు. వైరస్‌ను అతి తక్కువ సమయంలో గుర్తించడం అసాధారణమైన విషయమన్నారు. వైరస్‌కు చెందిన జన్యు క్రమాన్ని కొన్ని రోజుల క్రితమే షేర్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఇప్పుడు సిరాలాజికల్ అధ్యయనం సాగుతుంద న్నారు. చైనాతో పాటు బాధిత ప్రపంచ దేశాలు కరోనా పాజిటివ్ వ్యక్తుల సీరమ్‌ను పరీక్ష చేయవచ్చు అన్నారు.

సీనియర్ పాత్రికేయులు పొత్తూరి మృతి

సంతాపం తెలిపిన సిఎం కెసిఆర్

తెలంగాణ ఉద్యమానికి నైతిక మద్దతు ఇచ్చారని నివాళి

మంత్రులు, జర్నలిస్ట్ సంఘాల నేతలనివాళి

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ప్రముఖ పాత్రికేయుడు పొత్తూరి వెంకటేశ్వరరావు(86) కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా గురువారం ఉదయం ఆయన తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. పొత్తూరి 1934 ఫిబ్రవరి 8వ తేదీన ఏపీలోని గుంటూరు జిల్లా పొత్తూరులో జన్మించారు. 1957లో ఆంధ్రజనత ద్వారా పాత్రికేయరంగంలోకి ప్రవేశించి తెలుగు జర్నలిజంలో తనదైన ముద్ర వేశారు. అన్ని ప్రముఖ పత్రికలు ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఉదయం, వార్తా పత్రికల్లో పనిచేశారు. ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులుగా చాలా కాలం పనిచేశారు. పత్రికారంగంలో ఐదు దశాబ్దాలకు పైగా ఆయన సేవలు అందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పనిచేశారు. డాక్టర్ పొత్తూరి రచనలు.. ఆధ్యాత్మిక సంపాదకీయాల సంకలనం చింతన. స్ఫూర్తిగా నిలిచిన మహనీయుల మీద వ్రాసిన సంకలనం చిరస్మరణీయులు. తెలుగులో ఏ పత్రికలు ఏయే భావాలతో పుట్టాయో, ఏ ప్రత్యేకతలు సంతరించుకున్నాయో తెలిపే రచన నాటి పత్రికల మేటి విలువలు. పారమార్థిక పదకోశం, వ్యాసప్రభ వంటి తదితర రచనలు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ పొత్తూరి వెంకటేశ్వరరావు మృతిపట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పత్రికా, సామాజికరంగాల్లో చేసిన కృషిని, అందించిన సేవలను సీఎం కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పొత్తూరి అందించిన నైతిక మద్దతును కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. పొత్తూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విలువల జర్నలిజానికి పొత్తూరి వెంకటేశ్వర రావు నిజమైన ప్రతినిధి అని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దిగ్గజ పాత్రికేయులు పొత్తూరి మృతిపట్ల మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తెలంగాణ పోరాటానికి మద్దతుగా నిలిచిన పొత్తూరి మృతి పాత్రికేయరంగానికే గాక సమాజానికి తీరని లోటన్నారు. మానవీయతకు నిలువెత్తు నిదర్శనమన్నారు. పాత్రికేయ వృత్తిని అత్యంత బాధ్యతతో సామాజిక హితానికి, చైతన్యానికి వాడిన నిఖార్సైన జర్నలిస్టు అని కొనియాడారు.

మంత్రి హరీశ్‌రావు స్పందిస్తూ.. తెలుగు పత్రికారంగానికి పొత్తూరి వెంకటేశ్వరరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. నిఖార్సైన జర్నలిజంతో ఎందరికో మార్గదర్శిగా నిలిచిన వ్యక్తి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్న మంత్రి పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పందిస్తూ.. పాత్రికేయరంగంలో పొత్తూరి సేవలు మరువలేనివన్నారు. పొత్తూరి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి స్పందిస్తూ... పొత్తూరి మరణం జర్నలిజం ప్రపంచానికి తీరని లోటన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇక్కడి ప్రజల ఆకాంక్ష అంటూ నిష్కర్షగా చెప్పిన మహానుభావుడన్నారు. జర్నలిస్ట్ నేతలు అమర్, శ్రీనివాసరెడ్డి, అల్లం నారాయణ,ఆర్ఎన్ఎ చీఫ్ ఎడిటర్ అవ్వారు రఘు తదితరులు పొత్తూరికి ఘనంగా నివాళి అర్పించారు.

పవన్ కళ్యాణ్ నివాళి

తెలుగు పాత్రికేయ రంగంలో శిఖర సమానులైన పొత్తూరి వెంకటేశ్వరరావు మరణం పాత్రికే లోకానికి తీరని లోటు అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. పొత్తూరి మృతి పట్ల పవన్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు పత్రికా రంగానికి పొత్తూరి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా విశిష్ట సేవలందించాని గుర్తుచేశారు. వర్ధమాన పాత్రికేయులకు పొత్తూరి శైలి మార్గదర్శకం అని తెలిపారు. పొత్తూరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పవన్ అన్నారు.

నిర్భయ దోషులకు మార్చి 20న ఉరి

తాజాగా డెత్ వారెంట్ జారీ చేసిన పాటియాల కోర్టు
దోషులకు ఇక మూసుకుపోయిన న్యాయమార్గాలు
ఆనందం వ్యక్తం చేసిన నిర్భయ తల్లి ఆశాదేవి

న్యూఢిల్లీ, మార్చి 5 : నిర్భయ దోషులను ఉరి తీసేందుకు తేదీ ఖరారైంది. నలుగురు దోషులకు పటియాలా హౌస్ కోర్టు కొత్త డెత్ వారెంట్లు జారీ చేసింది. మార్చి 20వ తేదీన ఉదయం 6 గంటలకు నలుగురు దోషులను ఉరి తీయాలని పటియాలా హౌస్ కోర్టు అడిషనల్ సెషన్స్ జడ్జి ధర్మేందర్ రానా ఆదేశాలు జారీ చేశారు. ఉరి శిక్షకు సంబంధించి తీహార్ జైల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. జనవరి 22, ఫిబ్రవరి 1న ఉరి తీయాలంటూ ఇచ్చిన డెత్ వారెంట్లపై కోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. మార్చి 3న ఉదయం 6 గంటలకు నలుగురు దోషులను ఉరి తీయాలని గతంలో కోర్టు డెత్ వారెంట్లు ఇచ్చింది. కానీ గుప్తా.. రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేసుకోవడంతో అది కూడా ఆగిపోయింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు డెత్ వారెంట్లపై స్టే విధించింది పటియాలా హౌస్ కోర్టు. అయితే పవన్ కుమార్ గుప్తా క్షమాభిక్ష పిటిషన్ ను రాష్ట్రపతి తిరస్కరించడంతో.. నలుగురు దోషులకు న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలు అయిపోయాయి. దీంతో కోర్టు కొత్త తేదీని ప్రకటించింది.నిర్భయ కేసులో నలుగురు దోషులకు ఉరిశిక్షను అమలుచేసేందుకు కొత్త తేదీని ఖరారు చేయాలని కోరుతూ ఢిల్లీ ప్రభుత్వం స్థానిక కోర్టును కోరింది.

కేసులో చివరి దోషి పవన్‌కుమార్‌గుప్తా పెట్టుకున్న క్షమాభిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ తిరస్కరించిన నేపథ్యంలో బుధవారం ఈ మేరకు కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దోషులకున్న అన్ని న్యాయపరమైన అవకాశాలు ముగిసిపోయాయని కోర్టుకు తెలిపింది. దీనిపై గురువారంలోగా స్పందన తెలియజేయాలని అడిషనల్ సెషన్స్ జడ్జి ధర్మేంద్ర రానా దోషులను ఆదేశించారు. నోటీసులు జారీ చేయాల్సిన అవసరం లేదని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది చేసిన వాదనను జడ్జి తోసిపుచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(జీవించే హక్కు)లో పొందుపరిచిన సహజ న్యాయ సూత్రాలను, అవతలి వ్యక్తి వాదనను కూడా వినాలన్న నిబంధనను విస్మరించకూడదని పేర్కొంటూ.. దోషులకు నోటీసులు జారీచేశారు. దోషులకు ఉరిశిక్ష అమలుకు కొత్త తేదీ ఖరారు కోసం తీహార్ జైలు అధికారులు కూడా పాటియాలా హౌజ్ కోర్టును ఆశ్రయించినట్లు అధికారులు తెలిపారు. వాస్తవానికి నిర్భయ దోషులు ముకేశ్‌కుమార్ సింగ్ (32), వినయ్‌శర్మ (26), అక్షయ్‌కుమార్ సింగ్ (31), పవన్‌కుమార్‌గుప్తా (25)లను మార్చి 3న ఉరితీయాల్సి ఉన్నది. అయితే క్షమాభిక్ష పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున ఉరిశిక్షను వాయిదావేయాలని పవన్ కోర్టును ఆశ్రయించడంతో.. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు మరణదండనపై స్టే విధిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ప్రమాదాల్లో మొత్తం ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దుబ్బచెర్ల గ్రామంలో విషాదం నెలకొంది. బైక్‌పై వెళ్తున్న ఎర్ర గణెళిష్(45) అనే వ్యక్తి గ్రానైట్ రాయిని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అమీర్‌పేట్ నుండి మాణిక్యమ్మగూడ గ్రామానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అదేవిధంగా జగిత్యాల జిల్లా మేడిపల్లిలో బైక్ అదుపుతప్పి ఆర్టీసీ బస్సు కిందపడింది. ఈ దుర్ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. మృతులు ప్రకాశం జిల్లా వాసులుగా సమాచారం. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుండ్లపల్లివాసి కుంచల శివ, మంగమూరువాసి వేణు నవీన్‌గా గుర్తించారు.

తప్పిన బస్సు ప్రమాదం

సూర్యాపేట జిల్లాలోని మునగాల వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా తుని నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు మునగాల శివారులో సబ్‌స్టేషన్ ఎదుట అదుపుతప్పి రోడ్డు ప్రక్కకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. ఈ రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది.



రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిందతో భేటీ అయిన ఐస్‌లాండ్ మాజీ అధ్యక్షుడు ఓలాఫుర్ రాగ్నర్ గ్రిమ్సన్

నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్
8న రాష్ట్ర బడ్జెట్ సమర్పించనున్న మంత్రి హరీష్ రావు
అసెంబ్లీ సమావేశాలపై నేటి బిఎఎసిలో చర్చ

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సర్వం సిద్ధమయ్యింది. అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు శుక్రవారం నుంచి మొదలు కానున్నాయి. మొదటిరోజు అసెంబ్లీ, మండలి సంయుక్త సమావేశంలో గవర్నర్ తమిళిసై ప్రసంగించనున్నారు. ప్రభుత్వ ప్రాధామ్యాలను, దృక్పథాన్ని ఆమె తన ప్రసంగం ద్వారా తెలియచేయనున్నారు. ప్రధానంగా వివిధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, సంక్షేమ కార్యక్రమాలను ఇందులో ప్రస్తావించనున్నారు. కాళేశ్వరం ప్రాజెట్ సహా,24 గంటల కరెంట్, రైతు సంక్షేమ కార్యక్రమాలపై తన ప్రసంగంలో ప్రస్తావించే అవకాశాలు ఉన్నాయి.

గవర్నర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తమిళిసై అసెంబ్లీకి రానున్నారు. మరోవైపు బ్జడెట్ సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. అసెంబ్లీ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసెబ్లీ పరిసరాల్లో 14o4 సెక్షన్ అమల్లో ఉంటుంది. సీఎం కేసీఆర్ బుధవారం గవర్నర్ తమిళిసైని కలిసి అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల నిర్వహణ తీరుపై వివరించారు. అసెంబ్లీ ప్రసంగం కాపీని గవర్నర్‌కు అందజేశారు. ఈ నెల 8న బ్జడెట్‌ను ఆర్థికమంతం÷-రి హరీష్ రావు ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. బ్జడెట్ రూపకల్పన, దానిలోని పలు కీలక అంశాలను సైతం గవర్నర్భట్టికి తెచ్చారు. సాగునీటి పారుదల, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం కొనసాగించనున్నట్లు సీఎం వివరించారు. శుక్రవారం మధ్యాహ్నం జరగనున్న బీఏసీ మీటింగ్‌లో సమావేశాల నిర్వహణపై స్పష్టత రానుంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టాన్ని తేవాలని సీఎం భావిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆయన పలుసార్లు చెప్పారు. అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్?డ్డి, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పోలీసు శాఖ ఉన్నతాధికారులతోపాటు సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పోలీసు ఉన్నతాధికారులు వివరించారు.

మరోసారి తెరపైకి 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ కేసు

జ్యూడిషియల్ కమిషన్‌ను కలసిన కుటుంబ సభ్యులు

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్య - నిందితుల ఎన్‌కౌంటర్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. తమకు న్యాయం చేయాలంటూ దిశ నిందితుల కుటుంబ సభ్యులు గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దిశ నిందితులది బూటకపు ఎన్‌కౌంటర్ అని.. అందులో పాల్గొన్న పోలీసులపై కేసులు నమోదు చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు నియమించిన జ్యూడిషియల్ కమిషన్‌ను కలిసేందుకు వారు హైకోర్టుకు చేరుకున్నారు. పరిహారంపై కమిషన్ ముందు ప్రస్తావించాలన్న సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు గురువారం కమిషన్ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జ్యూడిషియల్ కమిషన్‌కు నిందితుల కుటుంబ సభ్యులు అఫిడవిట్ దాఖలు చేశారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలో గతేడాది నవంబరు 27న వెటర్నరీ వైద్యురాలు దిశపై మహ్మద్ ఆరిఫ్, జొల్లు నవీన్, జొల్లు శివ, చెన్నకేశవులు అనే నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడి.. అనంతరం ఆమెపై పెట్రోలు పోసి దారుణంగా హతమార్చిన విషయం విదితమే. ఈ క్రమంలో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా వారు పారిపోవడానికి ప్రయత్నం చేయడంతో ఎన్‌కౌంటర్ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఈ ఘటనపై విచారణ జరిపించాలని ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలు చేశారు. ఈ క్రమంలో... మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన జస్టిస్ వికాస్ శ్రీధర్ సిర్పుర్కర్ నేతృత్వంలో సుప్రీంకోర్టు ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు కమిషన్ ఏర్పాటు చేసింది.

మహాదివ్యక్షేత్రంగా యాదాద్రి అభివృద్ధి: మంత్రి సత్యవతి

యాదాద్రి నారసింహుడిని దర్శించుకున్న మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఇవో గీత ఉన్నారు.

యాదాద్రి భువనగిరి,మార్చి5(ఆర్ఎన్ఎ): రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు.

ఆలయానికి విచ్చేసిన మంత్రికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ యాదాద్రి ఆలయాన్ని రాతి శిలలతో అందంగా, మహా దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. వచ్చే బ్రహ్మోత్సవాలు కొత్తగా నిర్మితమైన ఆలయంలో అంగరంగ వైభవంగా ప్రపంచ అబ్బురపడేలా జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు.

నేటినిజం
శుక్రవారం 6-3-2020

పచ్చదనానికి ప్రపంచీకరణానికి మధ్య.!

పచ్చదనానికీ, ప్రపంచీకరణకు మధ్య కొనసాగుతున్న సంఘర్షణలో ఒకవైపు ప్రభుత్వాలు, మరోవైపు రాజకీయ పక్షాలు ప్రపంచీకరణకు బాసటగా నిలబడటం దీర్ఘకాల ప్రగతికి గొడ్డలిపెట్టు. భూమిని, పర్యావరణాన్ని కబళిస్తున్న కేంద్రీకృత కృత్రిమ ప్రగతి కేవలం తాత్కాళిక భ్రాంతి మాత్రమే! కానీ, వ్యవసాయాన్ని ధ్వంసం చేస్తున్న అటవీ హననం చేస్తున్న పారిశ్రామిక ప్రాబల్యానికి ప్రభుత్వాలు ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. హరిత పరిరక్షణ నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా పుట్టుకొచ్చిన పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం వారు తక్షణం మూసివేయాలి. 'హరిత అనుమతుల' ను పొందిన తరువాత మళ్ళీ ఆ పారిశ్రామిక సంస్థలు ప్రారంభం కావచ్చు! కానీ ఈ నియమాన్ని కేంద్ర ప్రభుత్వమే ఇపుడు నీరు కార్చింది. పరిశ్రమలకు గొప్ప వెసులుబాటు కల్పించింది. పచ్చదనంపై ప్రపంచీకరణ పైచేయి అవుతుండటానికి ఇది సరికొత్త ఉదాహరణ 'పర్యావరణ అనుమతి' ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్-ఇసి లేకుండానే పరిశ్రమలను నడిపిస్తున్న యజమానులు ఆరు నెలలలోగా కొత్తగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నది కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాటు అంటే ఇది హరిత నియమాలను ఉల్లంఘించిన పరిశ్రమలను క్రమబద్ధీకరించడం వంటిది. నియమనిబంధనలను పాటించకుండా పర్యావరణాన్ని పాడుచేసే లక్ష్యంతో నగరాలలో అంతస్థులను నిర్మిస్తున్నారు.

కానీ ఆ తర్వాత స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్రప్రభుత్వాలు కొంత రుసుమును కట్టించుకుని ఈ 'అక్రమాల'ను సక్రమాలుగా మారుస్తున్నారు. దీనికే క్రమబద్ధీకరణ అంటున్నారు. ఇదే రీతిలో పర్యావరణ నియమాలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసివేయాలి. కానీ 'రుసుము' తీసుకొని క్రమబద్ధీకరించినందువల్ల, కాలుష్యపు విషాలను కక్కి పరిసరాలను పాడుచేస్తున్న పరిశ్రమల స్వభావం మారిపోతుందా? అనేది ఆలోచించాలి. ఇవన్నీ గత ప్రభుత్వం ఇచ్చిన వారసత్వమే. ఈ వారసత్వం కారణంగానే ఇపుడు అక్రమ పరిశ్రమలకు ఆరునెలలలోగా 'హరిత అనుమతి' ఇవ్వడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మరి అడవులకు దిక్కెవ్వరు? హరిత శోభల 'క్షతి'ని నిరోధించి శోభను నిలబెట్టేవారు ఎవ్వరు? ఆకుపచ్చదనం నిజమైన ప్రగతికి సంకేతం! కానీ దశాబ్దాల తరబడి వ్యవసాయభూముల విస్తీర్ణం తగ్గిపోతోంది! దేశంలో మొత్తం భూభాగంలో కనీసం ముప్పై మూడు శాతం అడవులుండాలనేది అంతర్జాతీయ ఆదర్శం కానీ మన దేశంలో ఇరవైనాలుగు శాతం కంటే తక్కువ భూభాగంలో మాత్రమే అడవులున్నాయి. గత రెండేళ్ళుగా అడవుల విస్తీర్ణం తెలుగు రాష్ట్రాలలో మరీ తగ్గిపోయిందనేది సమాచారం. 'హరితహారం' 'చెట్టు నీరు' వంటి కార్యక్రమాల వల్ల అడవుల విస్తీర్ణం పెరగకపోవడమే అంతుపట్టని వ్యవహారం. అడవులతోపాటు జంతువులు కూడా నశించిపోతున్నాయి. అడవులలో నీటివాగులు ఎండిపోవడం వల్ల క్రూర జంతువులు, సాధుజంతువులు సమానంగా దప్పికతో అంతరించిపోతున్నాయి. ఇవి కాక అగ్నిప్రమాదాలు ! ఇక అరణ్యాలకు రక్షణ ఎపుడు..?

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూపు

-దరఖాస్తులను పరిశీలించాలంటున్న ప్రజలు

ఆదిలాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): రేషన్‌కార్డుల మంజూరు నిరంతర పక్రియ అని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదు. పది నెలలుగా కనీసం చేర్పులు, మార్పులు కూడా చేయడం లేదని పలువురు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు లేని పేదవారు అనారోగ్యం బారిన పడితే ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు అప్పులు చేయాల్సి వస్తోంది. పేదలు రేషన్ కార్డుల ద్వారా వచ్చే సబ్సిడీ బియ్యంతో పాటు విలువైన ఆరోగ్యశ్రీ కార్డులను పొందలేక పోతున్నారు. అనారోగ్యం బారిన పడిన వాళ్లు వైద్యం కోసం వేలాది రూపా యలు అప్పులు చేయాల్సి వస్తోంది. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు తహసీల్దార్ కార్యాల యాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్డుల మంజూరు పక్రియ పది నెలలుగా నిలిచి పోయింది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేసినట్లయితే మరికొంత మందికి ప్రయోజనం కలగనుంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో రేషన్ కార్డుల మంజూరులో అవకతవకలు జరిగాయని పాత వాటిని రద్దు చేసి కొత్తగా దరఖాస్తులను స్వీకరించి కార్డులను మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది చేర్పులు, మార్పుల కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆహార భద్రత కార్డు రేషన్ బియ్యం, ఇతర వస్తువులు తీసుకునేందుకు ప్రభుత్వ పరంగా సబ్సిడీ పథకాల ద్వారా లబ్ది పొందేందుకు, వివిధ రకాల రుణాలను పొందేందుకు ఉపయో గపడుతూ ఉంటుంది. ఇప్పటి వరకు రేషన్ కార్డు లేని వాళ్లు, ఉమ్మడి కుటుంబాల నుంచి వేరు పడి జీవిస్తున్న వాళ్లతో పాటు నూతనంగా వివాహాలు చేసుకున్న వారు నమోదు చేసుకునేందుకు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు నేరుగా ఆయా మండలాల తహసీల్దార్ల లాగిన్‌లోకి వెళ్తాయి. ఆయన విచారణ కోసం ఆర్ఐల లాగిన్‌కు పంపిస్తారు. విచారణ అనంతరం రేషన్‌కార్డు మంజూరు చేస్తారు. కానీ ప్రభుత్వం రేషన్ కార్డుల మంజూరు పక్రియను తాత్కాలికంగా నిలిపి వేయడంతో కొత్తవి మంజూరు కావడం లేదు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని తెలుస్తోంది. జిల్లాలో రేషన్ కార్డుల ద్వారా సుమారుగా 3.80 లక్షల మంది లబ్దిదారులు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే రేషన్ తీసుకుంటున్నారు. ఇంతకాలం ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశారు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు ఉన్న వాటిలో అవసరమైన వాటిలో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఆకతాయిలకు అడ్డగా క్రాస్‌రోడ్డు

-అఘాయిత్యాలతో పోకిరీల జల్సా

ఖమ్మం,మార్చి5(ఆర్ఎన్ఎ): బూర్గంపాడు మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్డు ఆకతాయిలకు, ఆసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. యువకులు జల్సాలకు ఆలవాటు పడి దారి దోపిడీలకు పాల్పడుతూ దొరికిన కాడికి దోచుకుంటున్నారు. నాలుగు నెలల క్రితం పలువురు యువకులు అటుగా వచ్చిన ఓ జంటపై దాడి చేయడంతో యువకుడు పారిపోగా యువతిపై అత్యాచారానికి పాల్పడటంతో మణుగూరు ప్రాంతాన్ని చెందిన ఆ యువతి కుటుంబసభ్యుల సహాయంతో మణుగూరు పోలీసులకు పిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి ఆరుగురు నిందుతులను ఆదుపులోకి తీసుకున్నారు. మణుగూరు క్రాస్ రోడ్డు నుంచి సారపాక వైపునకు, మెండికుంట వైపునకు వెళ్లే వరకు దట్టమైన ఆడవిని తలపించేలా పరిసరాలు ఉంటాయి.

ఇదే ఆదునుగా భావించిన ఆకతాయిలు ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ స్థానికులతో పాటు వాహనదారులను భయాభ్రాంతులకు గురిచేస్తున్నారు. అంతేకాక గోదావరి పుష్కరాల సమయంలో ఆటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన పుష్కరవనంలో సైతం మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారు. బూర్గంపాడు మండలంలో జరుగుతున్న దారి దోపిడీలు, అఘాయిత్యాలకు పాల్పడేందుకు ఆకతాయిలు ఎక్కువగా ఆదివాసీ గిరిజనులనే ఎంచుకుంటు న్నట్లు తెలుస్తోంది. నిరక్షరాస్యత, ఆమాయకత్వం వల్ల సమాచారం అధికారుల దృష్టికి వెళ్లకుండా ఉంటుందనే ఆలోచనతో ఇలా చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా బయట నుంచి వస్తున్న గిరిజనులకు ఇక్కడ వారితో సంబంధాలు లేకుండా పోవడం సైతం వారికి అదునుగా మారుతున్నట్లు తెలుస్తోంది. గతంలో జరిగిన పలు సందర్భాల్లో గిరిజనులపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనం. వరుస సంఘటనలతో మండలంలోని సారపాక నుంచి మణుగూరు క్రాస్ రోడ్డుగా మీదుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయాభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ప్రాంతంపై దృష్టి సా రించి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఇటువంటి సంఘటనలు జరిగినపుడు నిందితులను గుర్తించేందుకు వీలుకావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏకగ్రీవం పంచాయితీలకు అందని ప్రోత్సాహకం

-ఏడాదిగా ఎదురుచూస్తున్న సర్పంచ్‌లు

సిద్దిపేట,మార్చి5(ఆర్ఎన్ఎ): ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందడం లేదు. గ్రామాభివృద్ధికి గ్రామస్థులు, ఆశావహులు ఏకతాటి పైకి వచ్చి ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకున్నారు. వీరిని ప్రోత్సహించడానికి రాష్ట్రప్రభుత్వం రూ.పది లక్షల నజరానా ప్రకటించింది. జిల్లాలో ఏకగ్రీవమైన 78 గ్రామ పంచాయ తీలు రూ.7.8 కోట్ల కోసం ఎదురుచూస్తున్నాయి. ఎన్నికలు ఏకగ్రీవమైతే ఎంతో ఖర్చు కలిసొస్తుందని భావించిన ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహించింది.

గ్రామపంచాయతీల ఎన్నికల సందర్భంగా ఏకగ్రీవం కావడానికి తంటాలు పడిన అభ్యర్థులు బరిలో నిలిచిన వారికి పలు హామీలు గుప్పించారు. తమకూ ఎన్నికల ఖర్చు కలిసొస్తుందని రకరకాల హామీలు ఇచ్చారు. వారు కోరిన వార్డుల్లో పనులు చేసి పెడతామని చెప్పారు.

ప్రభుత్వపరంగా వచ్చే రూ.10లక్షల ప్రోత్సాహక నిధులు అందుకు వెచ్చిస్తామని చెప్పారు. ఇపుడు ఎన్నికలు ముగిసి ఏడాది దాటినా ప్రోత్సాహక సొమ్ము రాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. 2019 జనవరి, ఫిబ్రవరిలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించారు

. జిల్లాలోని 499 గ్రామపంచాయతీలున్నాయి. అందు లో 78 గ్రామపంచాయతీలను టీఆర్ఎస్ మద్దతుదారులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. వీటికి రూ.పదిలక్షల చొప్పున రూ.7.8కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇంతవరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు 14వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర గ్రాంట్లను విడుదల చేస్తున్నాయి. వీటితో పాటు పంచాయతీ పరిధిలో వసూలయ్యే పన్నులు గ్రామాభివృద్ధికి వినియోగిస్తున్నారు. హరితహారం, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటిక

ప్రజలను వెంటాడుతున్న కరోనా భయం

హైదరాబాద్, మార్చి 5:కరోనా కలకలంపై ఇప్పుడు ప్రజల్లో ఆందోళన నెలకొంది. బయటకు రావాలంటనే జనం భయపడు తున్నారు. మామూలు జలుపు,తుమ్ములకు కూడా జడుసుకుంటున్నారు. ఈ మహమ్మారి మనచెంతకే వచ్చిందన్న ఆందోళనలో ఉన్నారు. దీంతో ఎక్కడికి వెళ్లాలన్న భయం వెంటాడుతోంది. అందుకే నగరాల్లో సంచారం తగ్గింది. జనసమర్థం ఉన్న ప్రాంతాలకు వెళ్లడం లేదు. మొత్తంగా ఇప్పుడు వ్యాధి వస్తే ఎలా ఉండాలన్నది చర్చిస్తున్నారు. ముందు జాగ్రత్తలపై ఆరా తీస్తున్నారు. మనకే వైరస్ సోకితే ఎలా అని డాక్టర్లను సంప్రదిస్తున్నారు. మొత్తంగా ప్రజల్లో చావు భయం పట్టుకుంది. వ్యాధి నుంచి కోలుకోవడం, కోలుకోలేకపోవడం బాధితులకు అందే చికిత్సపైనా ఆధారపడి ఉంటుంది. వైరస్ వ్యాప్తి తీవ్రత, వనరుల లభ్యతపై చికిత్స ఆధారపడి ఉంటుంది. వైరస్ శరవేగంగా, విస్తృతంగా వ్యాపిస్తుంటే ఉంటే బాధితులందరికీ అవసరమైన స్థాయిలో చికిత్స అందకపోవచ్చు.

కోవిడ్19 వ్యాధి వల్ల వృద్ధులు, అప్పటికే అనారోగ్యంతో ఉన్నవారు, ఆడవారితో పోలిస్తే మగవారు చనిపోయే ఆస్కారం ఎక్కువని అంటున్నారు. నడివయసువారి కన్నా వయసు బాగా పైబడినవారిలో మరణాల రేటు పదింతలు ఎక్కువగా ఉన్నట్లు చైనాలో 44 వేలకు పైగా కేసులపై జరిపిన, తొలి భారీ అధ్యయనంలో వెల్లడైంది. 30 ఏళ్లలోపువారిలో మరణాల రేటు అత్యంత తక్కువగా ఉంది. ఈ జాబితాలోని 4,500 మంది బాధితుల్లో ఎనిమిది మంది చనిపోయారు. వైరస్ సోకిన సమయానికి ఆరోగ్యంగా ఉన్న వారితో పోలిస్తే మధుమేహం, అధిక రక్తపోటు లేదా గుండెజబ్బులు, లేదా శ్వాసకోశ వ్యాధులున్న బాధితుల్లో మరణాల రేటు ఐదింతలు ఎక్కువగా ఉంటుంది. మహిళలతో పోలిస్తే మగవారిలో మరణాల రేటు కొంచెం ఎక్కువగా ఉంది. ఏయేప్రాంతంలో ఏయే వర్గాలకు ఎంత ముప్పుందనే దానిపై పూర్తి వివరాలు ఇంకా అందుబాటులోకి రాలేదు. చైనాలో 80 ఏళ్ల బాధితులకు ఒక రకమైన ముప్పుంటే, ఐరోపా, ఆఫ్రికా ఖండాల్లో అదే వయసున్న బాధితులకు వేర్వేరు రకాల ముప్పు ఉండొచ్చు. వేర్వేరు ఇన్‌ఫెక్షన్ల కారణంగా మరణాల రేట్లను బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. కొత్త వైరస్ కావడంతో కేసులు ఎన్ని ఉన్నాయి అనే వివరాలు తెలియదు. ఏదైనా వైరస్ వ్యాపించినప్పుడు అది సోకిన ప్రతి ఒక్కరూ వైద్యులను సంప్రదించరు. అత్యధిక వైరస్‌ల విషయంలో ఇలాగే జరుగుతుంటుంది. వైరస్ సోకిన లక్షణాలు తక్కువ స్థాయిలో ఉంటే అత్యధికులు వైద్యులను సంప్రదించరు. అందువల్ల బాధితుల లెక్కింపులో ఇలాంటి కేసులు అన్నీ పరిగణనలోకి రాకపోవచ్చు. అయితే కరోనా భయం తీవ్రంగా ఉండడంతో ఇప్పుడు మామాఉలు జలుబు ఉన్న వారు సైతం గాంధీ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలకు క్యూ కట్టారు. ప్రధానంగా టెక్కీలు క్యూ కట్టారు. ప్రపంచవ్యాప్తంగా కరోనావైరస్ కేసుల్లో మరణాల రేటు ఒక్కో దేశంలో ఒక్కోలా కనిపిస్తుండటంతో వ్యాధి తీవ్రత ఎలా ఉంటుందన్న దానికి ఖచ్చితమైన లెక్కలు లేవు. వైరస్ సోకిన లక్షణాలు స్వల్పంగా ఉన్నవారిని గుర్తించడంలో కొన్ని దేశాలు మెరుగ్గా ఉండగా, మరికొన్ని దేశాలు బాగా వెనకబడి ఉన్నాయని లండన్ పరిశోధనలో తేలింది. కేవలం అధికారికంగా నవోద్దైన కేసుల ప్రాతిపదికగానే లెక్కగట్టే మరణాల రేటు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. మరణాల రేటు లెక్కించే సమయానికి ప్రాణాలతో ఉన్న బాధిత వ్యక్తి తర్వాత చనిపోయే ఆస్కారం కూడా ఉంది. అదే జరిగితే, మరణాల రేటును తక్కువగా లెక్క కట్టినట్లు అవుతుంది. ప్రతి వెయ్యి కరోనావైరస్ కేసుల్లో ఐదు నుంచి 40 కేసుల్లో రోగి మరణించే ఆస్కారం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. వెయ్యి మందిలో తొమ్మిది మంది అంటే దాదాపు ఒక శాతం మంది బాధితులు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఇకపోతే మన వాతావరణంలో వైరస్ పెద్దగా జీవించదని అంటున్నారు. దీనికి భయపడాల్సిన పనిలేదని మంత్రి ఈటెల రాజేందర్ భరోసా ఇచ్చారు. మరణాల రేటు రెండు శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండే ఆస్కారముందని నిపుణులు చెప్పారు. బాధితుల వయసు, లింగం, ఆరోగ్య స్థితి, వారు నివసించే ప్రాంతంలో ఉండే ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ లాంటి అంశాలపై కోవిడ్19 మరణాల రేటు ఆధారపడి ఉంటుంది. ఇలాంటి ప్రతి అంశానికి సంబంధించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకొని శాస్త్రవేత్తలు మరణాల రేటును అంచనా వేస్తారు. అయితే చైనాలోని హుబే రాష్ట్రం డేటాను మాత్రమే చూస్తే మరణాలు రేటు చాలా ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. చైనాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే హుబేలో మరణాల రేటు బాగా ఎక్కువగా ఉంది. హుబే రాజధాని వుహాన్‌లోనే వైరస్ తొలుత బయటపడింది. మరణాల రేటు లెక్కింపులో హుబేకు మాత్రమే పరిమితం కారు. వైరస్ అందరిపైనా ఒకే విధంగా ప్రభావం చూపడం లేదని తెలుస్తోంది. ఇదంతా ఒక ఎత్తయితే దీనికి మందులు లేవన్న విషయం ప్రజలను బాగా కలవరపెడుతోంది. అందుకే మామూలు జలుబు సోకినా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇలాంటి వారి భయాలు తొలగాలంటే పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. సోషల్ మీడియాలో దుష్ప్రచారంతో పాటు, ఆరోగ్య సూత్రాలపై చేస్తున్న వ్యాప్తిని అరికట్టాలి. ప్రభుత్వమే నిర్దిష్ట సమాధానాలు ఇవ్వాలి. పరిశుభ్రతను పాటించిడం అలవాటు చేసుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచడం చేయాలి. పారిశుద్య పనులను విస్తృతం చేయాలి. అప్పుడే ప్రజల్లో కూడా నమ్మకం పెరుగుతుంది. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం తక్షణావసరం.దేశంలో కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య ఒక్కొక్కటిగా పెరుగుతుండడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని రకాలుగా వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటోంది. వదంతులు ప్రచారాన్ని అడ్డుకుంటూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తోంది. ఎప్పటికప్పుడు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకుంటోంది.

ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి

ఎండలో నిలబడడం ద్వారా వైరస్‌ను దూరం చేయొచ్చు

పరిశుభ్రతపై విద్యార్థులకు సూచించిన కేంద్రం

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): శీతలంగా ఉండే వాతవరణంలోనే కరోనా బతుకుతుంది. అందువల్ల ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇకపోతే కరోనా వైరస్ నుంచి రక్షించుకునేందుకు యునిసెఫ్ కొన్ని సూచనలు చేసింది. వైరస్ ఎక్కడ, ఎంత సేపు బతుకుతుందో తెలయిచేసింది. అది సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించింది. కరోనా గాలి నుంచి సోకదని, వస్తువులపై మాత్రమే ఉంటుందని తెలిపింది. వైరస్ అంటిన వస్తువులను ముట్టుకుని నోరు లేదా ముక్కు దగ్గర చెయ్యి పెడితేనే వైరస్ అంటుతుంది. వస్తువుల మీద ఉన్న వైరస్ బతికేది కేవలం 12 గంటలే. నీళ్లు, సబ్బుతో కడిగితే వైరస్ పోతుంది. బట్టలపై 9 గంటల పాటు వైరస్ బతుకుతుంది. రెండు గంటలు ఎండలో ఆ బట్టలను పెడితే వైరస్ చచ్చిపోతుంది. 6 నుంచి 27 డిగ్రీల టెంపరేచర్ వద్ద వైరస్ బతకదు. కాబట్టి మన దగ్గర దాని మనుగడ అంతంతే. వేడి నీళ్లు, ఎండకు ఉండడం ద్వారా వైరస్‌ను చంపేయొచ్చు. ఐస్ క్రీమ్ , కూల్‌డ్రింకుల వంటి వాటిని తీసుకోకపోవడం మంచిది. వైరస్‌లోని కణం సైజు 400 నుంచి 500 మైక్రాన్లు ఉంటుంది. చేతులపై వైరస్ ఉండేది కేవలం 10 నిమిషాలే. శానిటైజర్లతో కడిగితే వైరస్‌ను చంపేయొచ్చు. వేడి ఉప్పు నీటితో గార్గిల్స్‌ను తీసుకుంటే టాన్సిల్స్‌కు కారణమయ్యే క్రిములను చంపేయొచ్చు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లోని విద్యా సంస్థలకు కొన్ని సూచనలు చేస్తూ కేంద్రం అడ్వైజరీ జారీ చేసింది. విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని చెబుతూ రాష్ట్రాల సీఎస్‌లు, విద్యా శాఖ కార్యదర్శులు, సీబీఎస్ఈ చైర్‌పర్సన్‌కు కేంద్ర మానవ వనరుల శాఖ లేఖలు పంపింది. విద్యార్థులకు కరోనా రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు జ్వరం, జలుబు లాంటి ఉంటే వారికి వెంటనే సెలవు ఇవ్వాలని సూచించింది. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని తెలపింది. తరచూ చేతులు కడుక్కోవాలి. తుమ్ములు, దగ్గు వచ్చేటప్పుడు కర్చీఫ్ లేదా టీష్యూ అడ్డుపెట్టుకోవాలి. దీని ద్వారా కరోనా వైరస్‌తో పాటు ఇన్‌ఫ్లూయెంజా లాంటి పలు అంటువ్యాధులను నివారించవచ్చని తెలపింది. విద్యార్థులు, యువతకు ఈ సమాచారం తెలియజేయడం ద్వారా మరింత మందికి అవగాహన కల్పించవచ్చు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలని కేంద్రం కోరింది.

గోదారమ్మ చెంత ఆత్మహత్యలు

జీవితంపై విరక్తి చెందిన వారికి డెత్ స్పాట్

రక్షణ కంచె ఏర్పాటు చేయాలంటున్న పోలీసులు

కరీంనగర్,మార్చి5(ఆర్ఎన్ఎ): కాళేశ్వర జలాలతో గోదావరినది నిండుకుండలా మారింది... దీనితో గోదావరిఖని సమీపంలో గోదావరి వంతెన సందర్శకుల తాకిడి పెరిగింది. సెల్‌ఫోన్‌లలో ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ అనుభూతి పొందుతున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ఈ బ్రిడ్జిపై నుంచి ప్రయాణించే వారే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా జల దృశ్యాన్ని చూడటానికి వస్తున్నారు. అయితే ఈ వంతెన పలువురికి ఆనందాన్నే కాదు కొందరికి విషాదాన్ని పంచుతోంది. జీవితాలపై విరక్తి చెందిన వారికి.. ఇదో ఆత్మహత్యల కేంద్రంగా మారింది. గోదావరివంతెనపై నుంచి నదిలో దూకి గత ఆరు నెలల కాలంలో ఎనిమిది మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో వీటి నివారణ పోలీసులకు తలనొప్పిగా మారింది. గోదావరి ఉధృతంగా ఉండడంతో శవాలను కనుక్కోవడం కూడా కష్టంగా మారింది. ఇదే సమయంలో కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరి వంతెననే ఆశ్రయిస్తున్నారు. క్షణికావేశాలతో గోదావరినదిలో దూకుతున్నారు. గోదావరినది నిండుకుండలా ఉండడంతో నదిలో దూకిన వారి ఆచూకీని కనిపెట్టడం కష్టతరం అవుతున్నది. దీంతో రక్షణ గోడ లేదా కంచె ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ఆత్మహత్య నివారణకు ఇదొక్కటే మార్గమని పోలీసులు కూడా అభిప్రాయపడుతున్నారు. జీవితంపై విరక్తి చెందిన వారు ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరిఖని వంతెనకే వస్తున్నారని గత సంఘటనలను బట్టి తెలుస్తోంది. గోదావరి వంతెనపై కంచె ఏర్పాటు చేయడమే ఆత్మహత్యల నివారణకు పరిష్కారం కాగలదని పోలీసులు భావిస్తున్నారు. ఔట్ పోస్టును ఏర్పాటు చేసి సిబ్బంది 24గంటలు పర్యవేక్షిస్తూనే ఉన్నా.. ఆత్మహత్యలు ఆగడం లేదు. ఒక వైపు సిబ్బంది వెళితే మరో వైపు గోదారిలో దూకుతూనే ఉన్నారు. ఎన్‌టీపీసీ యాజామాన్యాన్ని కంచె ఏర్పాటు గురించి సంప్రదించామని గోదావరిఖని ఎసిపి ఉమేందర్ తెలిపారు. తగిన రక్షణ చర్యలు లేక పోవడం వల్లనే ఇక్కడ ఆత్మహత్యలు చేసుకునేందుకు ఆస్కారం ఏర్పడుతోందని విమర్శలు వినవస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సుందిళ్ల బ్యారేజీలో పెద్దఎత్తున నీటిని నిల్వ ఉంచడంతో గోదావరినది నిత్యం నిండుకుండలా మారింది. రెండు గట్ల ఎత్తున నీరు నిల్వ ఉంటుంది. వంతెనపై నుంచి నీరు అందుతుందా అనేంత స్థాయిలో జలాలు ఉన్నాయి. గోదావరి వంతెనపై కేవలం రెండున్నర అడుగుల ఎత్తు వరకు మాత్రమే రక్షణ గోడలున్నాయి. నిత్యం సందర్శకులు ఈ జలాలను చూసేందుకు వస్తున్నారు. సుందిళ్ల బ్యారేజీ నీటి నిల్వ చేసినప్పటి నుంచి ఆత్మహత్యాయత్నాల ఘటనలు తరచూ చోటు చేసుకుంటు న్నాయి. ఒక రోజు ఇద్దరు ఆత్మహత్యాయత్నం పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో పోలీసులు ఆత్మహత్యల నివారణకు నాలుగు నెలల క్రితంప్రత్యేక పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఔట్ పోస్టు ద్వారా వంతెనను పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలూ షిఫ్టుల వారిగా ఇక్కడ నిఘా కొనసాగుతోంది. అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించి ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 31మందిని కాపాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరినది గోదావరి వంతెన వద్ద పెద్దఎత్తున నీరు నిల్వ ఉంది. ఈ నీటి నిల్వ చేస్తున్నది నీటి పారుదల శాఖ. వంతెన ఆర్‌అండ్‌బీకి సంబంధించినది. గోదావరినది వంతెన వద్ద రక్షణ ఏర్పాట్లు చూడాల్సిన ఈ రెండు శాఖలు స్పందించక పోవడం ఇప్పుడు ప్రజలకు శాపగం మారింది. వంతెనపై నుంచి ప్రజలు దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్నా రక్షణ చర్యలు మాత్రం చేపట్టడం లేదు. ఇరువైపులా రక్షణ కంచె ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలు చేసుకునే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

రైల్వేఫుట్ ఓవర్‌బ్రిడ్జిపై అనుమానాలు

ఏడాదయినా ముందుకు కదలని నిర్మాణం

మంచిర్యాల,మార్చి5(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు అడ్డంకిగా ఉన్న గేటు వద్ద రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఇప్పుడు సందిగ్ధంలో పడింది. ఏడాదిగా నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ప్రజలు అనుమానాల

సంక్షోభంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం?

ఆరుగురు ఎమ్మెల్యేలకు బిజెపి గాలం
మంత్రుల ఆరోపణలతో వేడెక్కిన రాజకీయం
తమకేమీ ధోకాలేదన్న సిఎం కమల్‌నాథ్

భోపాల్,మార్చి5 (ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి కమల్ నాథ్ ప్రభుత్వం సంక్షోభంలో పడినట్టు కనిపిస్తోంది. అధికార పక్షానికి చెందిన 8మంది ఎమ్మెల్యేలు హర్యానాలోని ఓ లగ్జరీ హోటల్లో దర్శనమివ్వడం కలకలం రేపుతోంది. దీంతో తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్నారు. తమ ఎమ్మెల్యేలను గురుగ్రామ్ హోటల్‌లో నిర్బంధించారని రాష్ట్ర ఆర్థిక మంత్రి తరుణ్ భానోత్ ఆరోపించారు. ఇందులో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు బీఎస్పీ ఎమ్మెల్యేలు, ఓ సమాజ్వాదీ పార్టీ ఎమ్మెల్యే, ఓ స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నట్టు తెలిపారు. ఇక ఇప్పటికిప్పుడు తమ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదని ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ సంచలనాల కోసమే తప్పుడు ఆరోపణలు చేస్తుందని కమలనాథులు మండిపడుతున్నారు. మధ్యప్రదేశ్‌లో తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్న కాంగ్రెస్ ఆరోపణలతో అక్కడి రాజకీయాలు రసవత్తరంగా మారాయి. తమ ప్రభుత్వంలోని ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ నేతలు బలవంతంగా తీసుకెళ్లి హర్యానాలోని ఒక హోటల్‌లో నిర్బంధించారని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి జితూ పట్వారీ పేర్కొన్నారు. 'మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, మంత్రులు నరోత్తం మిశ్రా, భూపేంద్ర సింగ్, రామ్‌పాల్ సింగ్ సహా మరికొంత మంది సీనియర్ బీజేపీ నేతలు కలిసి మా పార్టీకి చెందిన నలుగురు, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి ఇద్దరు, సమాజ్‌వాది నుంచి ఒకరు, మరొక ఇండిపెండెంట్ ఎమ్మెల్యేను హర్యానాలోని ఒక హోటల్‌కు తరలించారు. కుట్రలో భాగంగానే ఇదంతా చేస్తున్నారు. తీసుకెళ్లొద్దని చెప్పినా వినకుండా మమ్మల్ని హోటల్‌కు తరలించారని ఒక ఎమ్మెల్యే మాకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారిని వెంటనే వెనక్కు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే నలుగురు తిరిగొచ్చారు' అని పట్వారీ పేర్కొన్నారు. అంతకుముందు మాజీ ఎంపీ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ.. అధికార కూటమిలో ఉన్న బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను బీజేపీ నాయకులు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లారని ఆరోపించారు. కుట్రలో భాగంగా బారీ మొత్తంలో నగదు ఇవ్వజూపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యేలను తిరిగి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ నేతలు హరియాణా లోని హోటల్‌కు వెళ్లడానికి ప్రయత్నించగా అక్కడి పోలీసులు అడ్డుకున్నట్లు వార్తలు వచ్చినట్లు తెలిసింది. కాగా దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి కమల్‌నాథ్ స్పందించారు. మధ్యప్రదేశ్‌లో మా ప్రభుత్వానికి వచ్చిన ధోకా ఏం లేదని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు వల వేస్తుందని, తమకు ఫ్రీ మనీ వస్తోందని ఎమ్మెల్యేలు తనతో చెబుతున్నారని ఆయన అన్నారు. ఎవరు పార్టీలో నుంచి వెళ్లిపోయినా మా ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంలేదని కమల్‌నాథ్ పేర్కొన్నారు.

అమరావతికి చేరని ఎక్స్‌ప్రెస్ హైవే

చిలకలూరిపేట బైపాస్ వరకే పరిమితం
రాజధానిని తొలగిస్తూ సర్కారు కీలక నిర్ణయం

అమరావతి,మార్చి5(ఆర్ఎన్ఎ): రాజధానిగా అమరావతి పద్దన్న ప్రతిపాదనతో ముందుకు వెళుతున్న జజగన్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టును మధ్యలోనే వదిలేసింది. దీనిని కొనసాగించడం ఖర్చుతో కూడుకున్న పనిగా చూపుతూ చేతులెత్తేసింది.

ప్రతిష్టాత్మకమైన అనంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నుంచి అమరావతిని తొలగించడానికి రంగం సిద్ధమైంది. భూసేకరణ భారంగా మారిందని, రహదారిని అమరావతి వరకూ తీసుకెళ్లలేమని, గుంటూరు జిల్లా చిలకలూరిపేట వరకే పరిమితం చేయాలని నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. దీంతో అమరావతి అన్నది రాజధానిగా ఉండదన్న ధృఢాభిప్రాయం కల్పిస్తోంది. దీంతో రహదారి అలైన్‌మెంట్, రైట్ ఆఫ్ వేలో మార్పులు ప్రారంభించిన విషయాన్ని ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ధ్రువీకరించారు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే చిలకలూరిపేట వరకే ఉంటుందన్నారు. భూ సేకరణకు త్వరలో 3డీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. భూసేకరణ ఖర్చు భారీగా ఉంటోందని ఆయన పేర్కొన్నారు. రాజధానే ఉండదు కాబట్టి నాలుగు వరసల రహదారి ఎందుకని ప్రభుత్వం భావించిందా... లేక భూసేకరణ వ్యయం నిజంగా భరించలేనంతగా ఉందా అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి అమరావతిని తీసేయాలని నిర్ణయించడంలోని ఆంతర్యం ఏమై ఉంటుందని చర్చ జరుగుతోంది.

రాజధానిని ఇంకా అధికారికంగా తరలించకముందే కీలకమైన రహదారి ప్రాజెక్టు నుంచి అమరావతిని తొలగించాలన్న ప్రయత్నాలు తుదిశకు చేరుకున్నాయి. మారిన అలైన్‌మెంట్ ఆధారంగా భూసేకరణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసేందుకు సర్కారు రంగం సిద్ధం చేస్తోంది. రాజధాని పరిరక్షణ పేరిట రైతాంగం ఉద్యమాన్ని కొనసాగిస్తున్న తరుణంలో, రహదారి ప్రాజెక్టులో అమరావతి అన్నదే లేకుండా ప్రయత్నాలు జరుగుతుండటం గమనార్హం. రాయలసీమను అమరావతికి అనుసంధానించాలని గత ప్రభుత్వం అనంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను ప్రతిపాదించింది. రూ.25వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. రహదారి నిర్మాణ బాధ్యతలను ఎన్‌హెచ్ఏఐకి అప్పగించింది. భూ సేకరణ పనులు మొదలయ్యాయి. గుంటూరు జిల్లాలో భూసేకరణ కష్టంగా ఉందని, ప్రభుత్వంపై మరింత భారం పడుతుందని అధికారులు నివేదించారని తెలుస్తోంది. దీంతో అలైన్‌మెంట్ మార్చాలని, చిలకలూరిపేట వరకే రహదారి అనుసంధానం చేయాలని, ఆపై వద్దని స్పష్టంగా ఆదేశించినట్లు తెలిసింది. కేంద్రం ఆమోదించిన ఆర్ఓడబ్ల్యూప్ర కారం అనంతపురం జిల్లా మర్రూరు నుంచి చిలకలూరిపేట, ప్రత్తిపాడు, ఫిరంగిపురం ప్రాంతాల నుంచి తాడికొండ మండలం పెద్దపరిమి దాకా రహదారిని ప్రతిపాదించారు. ఇందులో కర్నూలు, కడప నుంచి కలిసే రహదారులను మినహాయిస్తే కొత్తగా నిర్మించేది 394కి.మీ. మూడు పంటలు పండే ప్రాంతాల్లో భూ సేకరణ ఎప్పటికీ సజావుగా సాగదు. భూసేకరణ ఖర్చు భారీగా పెరిగిపోతుందని సర్కారుకు ఆర్‌అండ్‌బీ నివేదిస్తోంది.

రుణమాఫీ ప్రకటన కోసం రైతుల ఎదురుచూపు

-బడ్జెట్‌లో పెడతారని రైతాంగం ఆశ

సంగారెడ్డి,మార్చి5(ఆర్ఎన్ఎ): రుణమాఫీ పక్రియను త్వరలోనే చేపడుతామంటూ మంత్రి కేటీఆర్ చేసిన ప్రకటనతో రైతుల్లో ఆశలు చిగురించాయి. దీనికి సంబంధించి అసెంబ్లీలో సిఎం కెసిఆర్ ప్రకటన చేస్తారనన్న భావనలో ఉన్నారు. రుణమాఫీకి సహకార సంఘాలు బాధ్యత తీసుకోవాలంటూ కెటిఆర్ సూచించారు. అయితే రుణమాఫీ ఏ రైతులకు వర్తిస్తుందనే అంశాలపై అధికారులు, బ్యాంకర్లు స్పష్టత ఇవ్వకపోవడం రైతులను అయోమయంలో పడేస్తున్నది. ఇందుకు సంబంధించి రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నుంచి ఉత్తర్వులు వస్తే కానీ రుణమాఫీ ఎవరికి వర్తిస్తుందో తేలుతుంది. ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన ప్రకారం 2018 డిసెంబరు 11 వరకు రైతులు తీసుకున్న లక్ష రూపాయల రుణాలు మాఫీ అవుతాయి. తీసుకున్న రుణాలను 2019లో చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేయడం వల్లే 40 శాతం రైతులు రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చిందని రైతు సంఘాల ప్రతినిధులు గుర్తుచేస్తున్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వంపై రైతులకు నమ్మకం సన్నగిల్లుతోందని రైతు రక్షణ సమితి అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గతంలో అనేకసార్లు ప్రకటనలు చేసి రైతులను అయోమయానికి గురిచేశారు. అటు సకాలంలో రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందక, ఇటు రుణమాఫీ అమలు కాకపోవడంతో రైతులు అప్పుల పాలయ్యారు. రైతులకు ఆశలు చూపకుండా వెంటనే రైతు రుణమాఫీ చేసి రైతులకు భరోసా కల్పించాలి. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతుబంధు ఇంకా చాలామందికి అందలేదన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రుణమాఫీ అమలుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం అడపాదడపా మాత్రం ప్రకటన చేస్తుండడం గమనార్హం. అయితే ఇలాంటి ప్రభుత్వ ప్రకటనలతో తమకు సంబంధం లేదని, ఉత్తర్వులు వస్తేనే పరిగణనలోకి తీసుకుంటామని బ్యాంకు వర్గాలు అంటున్నాయి. అంతవరకు తీసుకున్న రుణాలను రైతులు చెల్లించాల్సిందేనని బ్యాంకు వర్గాలు తెలిపాయి. రుణాలు తీసుకున్నరైతుల్లో 41 శాతం మంది మాత్రమే రెన్యూవల్ చేసుకున్నారు. మిగతా రైతుల రుణాలు బకాయిలుగానే ఉండిపోయాయి.

రేవంత్‌రెడ్డి భూకబ్జాలపై చర్య తీసుకోవాలి

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): భూకబ్జాలకు పాల్పడుతున్న ఎంపీ రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి పాపయ్య ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించి? రేవంత్‌రెడ్డితో పాటు అతని అనుచరులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పేదల భూములను బలవంతంగా లాక్కొని కబ్జా చేయడమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నాడని మేడి పాపయ్య ఆరోపించారు. ఆక్రమించిన భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఒక పార్లమెంట్ సభ్యుడు ఇలాంటి భూకబ్జాలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. రేవంత్ రెడ్డి పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దేశానికి సరైన నేతృత్వం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యం

ప్రత్యామ్నాయ కూటమి కోసం ప్రజల ఎదురుచూపు
కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు విసిగి వేసారి పోయారు
మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి అభిప్రాయం

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): దేశ రాజకీయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఢిల్లీలో అధికార ప్రతినిధి, మాజీకేంద్ర మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. దేశంలో నాయకత్వం వహించే లక్షణాలు సీఎం కేసీఆర్‌కు ఉన్నాయని... సీఎం నేతృత్వంలో ప్రత్యామ్నాయ కూటమి ఏర్పడాలని ఆకాంక్షించారు. దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం రావాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

ఆయనతోనే దేశ రాజకీయాల్లో మార్పు సాధ్యమని అన్నారు. దేశంలో ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. థర్డ్ ఫ్రంట్‌కు నాయకత్వం వహించే శక్తి కేసీఆర్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. మోదీ నాయకత్వంలో బ్యాంకులు లూటీ అవుతున్నాయని, బ్యాంకుల స్కామ్ వెనుక మోదీ ప్రభుత్వం ఉన్నట్లుందని ఆరోపించారు. దేశ వనరులను కాంగ్రెస్, బీజేపీ ఉపయోగించుకోలేక పోయిందని వ్యాఖ్యానించారు. వామ పక్షాలు అభిప్రాయ భేదాలు పక్కన పెట్టి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. సీఎం కేసీఆర్‌కు తెలుగు ప్రజలు అందరూ మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు విసిగి వేసారి పోయారన్న చారి ..కుంభకోణాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్ అయిందన్నారు. బ్యాంకులు లూటీ అవుతుంటే ప్రధాని ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలపాలన్నారు. ప్రజల సొమ్ముకు ఏ విధంగా భద్రత కల్పిస్తున్నారో చెప్పడం లేదన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో సంస్కరణలు ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్న మాజీమంత్రి.. వనరులను సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచన కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నప్పుడు దేశంలో రైతులకు ఉచిత కరెంట్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇదిలావుంటే కెసిఆర్ నిర్ణయంతో విపక్షాలకు దిక్కుతోచకుండా పోయింది. కాంగ్రెస్, బిజెపిలకు అసలు అంశం లేకుండా పోయిందన్న భావన వస్తోంది. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్రపై సీఎం కేసీఆర్ గతంలోనే చేసిన ప్రకటన ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. కేసీఆర్ ప్రకటన తర్వాత ఇప్పుడు రాజకీయ చర్చలన్నీ ఆయన చుట్టూనే చర్చ కేంద్రీకృతమయ్యాయి. దేశవ్యాప్తం గా రాజకీయ వర్గాలతో పాటు రాష్ట్రంలోని సాధారణ ప్రజానీకం కూడా కేసీఆర్ జాతీయ రాజకీయరంగ ప్రవేశం, అందుకు దారితీసిన పరిస్థితులు, పర్యవసానాలు, భవిష్యత్తులో చోటు చేసుకోనున్న పరిణామాలు, టీఆర్ఎస్ పార్టీలో అంతర్గత మార్పులపై ఊహాగానాలు, అంచనాలు సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలం నుంచి ఎత్తుగడలను వేయడంలో కెసిఆర్ సిద్ధహస్తుడు. జాతీయ రాజకీయాల్లో పెను మార్పులకు కెసిఆర్ కేంద్ర బిందువు కాగలరని కొందరు తాజా పరిస్థితిని విశ్లేషిస్తున్నారు. మొత్తంగా కెసిఆర్ జాతీయ రాజకీయాలకు చేరువ అవుతున్నారని తెలుస్తోంది. నేతల వ్యాఖ్యలు కూడా దీనిని బలపరుస్తోంది.

యాదాద్రిలో వైభవంగా స్వామి కళ్యాణోత్సవం

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

యాదాద్రి,మార్చి5(ఆర్ఎన్ఎ): యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరుకళ్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యింది. స్వామివారి కళ్యాణమహోత్సవంలో దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన మంత్రి అల్లోల దంపతులకు ఆలయ ఈవో, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా... అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం మంత్రి అల్లోల దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునితా మహెందర్ రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే మంగళవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టువస్త్రాలు... వజ్రవైఢూర్యాలు ధరించిన పంచనార సింహుడు అశ్వవాహనంపై మండపానికి చేరుకున్నారు. అప్పటికే లక్ష్మీదేవి ముద్గమనోహర రూపంతో ముత్యాల పల్లకిపై ఆసీనురాలై ఉంది. ఎదురెదురుగా కూర్చున్న శ్రీవారు, లక్ష్మీ అమ్మవార్ల పెండ్లిచూపుల తంతును పాంచరాత్రాగమాను సారం అర్చక బృందం, వేదపండితులు నిర్వహించారు. మంగళవారం రాత్రి యాదాద్రీశుడి కల్యాణ సుమూహూర్తమును నిర్వహించే ఎదుర్కోలు మహోత్సవ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీనృసింహుడు, అమ్మవార్ల లోకరక్షణ తీరును వారిరువురి వైభవాన్ని వివరించే తిరుకలాణమహోత్సవానికి సంబంధించిన పక్రియను వధూవరుల గోత్ర, ప్రవర, పరిచయాదులు చేసుకుని సుమూహూర్త నిర్ణయంలో వేదుక నిర్వహించడం ఆగమశాస్త్ర ప్రత్యేకం. బాలాలయ కల్యాణమండపంలో రాత్రి నిర్వహించిన కార్యక్రమంతో బ్రహ్మోత్సవాల్లో విశేషోత్సవాలకు తెరలేచింది. పట్టువస్త్రాల అలంకరణలతో అశ్వవాహన సేవపై శ్రీనారసింహుడు, ముత్యాల పల్లకి ద్వారా లక్ష్మీదేవి ఆలయం నుంచి ఊరేగింపుగా బయల్దేరారు. మేళ తాళాల మధ్య సేవ నిర్వహించారు. బాలాలయంలో ఎదురెదురుగా స్వామి, అమ్మవార్లను అధిష్టింపజేశారు. ఇరుపక్షాలుగా వీడిన నిర్వాహకులు పెండ్లి పెద్దలుగా వ్యవహరించారు. శ్రీవారి వైపు ఆలయ ఈవో గీత, అమ్మవారి వైపు ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి పెండ్లి పెద్దలుగా వ్యవహరించారు. ప్రధానార్చకులు నల్లందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపుడి నరసింహాచార్యులు, ఉప ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, బట్టర్ సురేంద్రాచార్యులు ఆధ్వర్యంలోని అర్చకులు పూజా కైంకర్యాలు జరిపారు.

కరోనా వదంతులు నమ్మకండి

గాలి ద్వారా వైరస్ వ్యాప్తి చెందదు
కరోనా వైరస్‌తో మరణాల శాతం చాలా తక్కువ
ముందు జాగ్రత్తలతో వ్యాధికి దూరంగా ఉండవచ్చు
హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ వివరణ

హైదరాబాద్,మార్చి4(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. కరోనాకు సంబంధించి.. వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురిచి ఆయన మీడియా ద్వారా వివరించారు. కరోనా వైరస్ గాలి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి కాదని ఆయన స్పష్టం చేశారు. కరోనాపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. చైనాతో పాటు ప్రపంచవ్యాప్తంగా లక్షకు పైగా ప్రజలు కరోనా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారనీ.. కానీ, వారిలో కేవలం 3 శాతం మంది మాత్రమే మృత్యువాత పడ్డారనీ, 5 శాతం మందిలో మాత్రమే వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నదని డా. శ్రీనివాస్ వెల్లడించారు. కరోనా వైరస్‌తో మరణాల శాతం చాలా తక్కువగా ఉందని ఆయన వివరణ ఇచ్చారు. వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తి తుమ్మినప్పుడు కానీ, దగ్గినప్పుడు కానీ, వోచేతితో లేదా కర్చీఫ్‌తో కవర్ చేసుకోవాలని సూచించారు. వ్యాధికి గురైన వ్యక్తి.. తుమ్మినపుడు 2 మీటర్ల దూరం ఉంటేనే అది సోకే అవకాశం ఉంటుందనీ.. అది కూడా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లకు మాత్రమే వ్యాపిస్తుందని వివరించారు. పలు జాగ్రత్తలు తీసుకుంటే ఈ మహమ్మారిని తరిమేయొచ్చని డా. శ్రీనివాస్ వెల్లడించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న కరోనా బారిన పడిన వ్యక్తి కోలుకుంటున్నారని ఆయన తెలిపారు. అలాగే, కరోనా సోకిన వ్యక్తి కలిసిన అందరికీ వైరస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కరోనా వైరస్ నివారణకు సరైన వైద్య చికిత్సలు లేవని డా. శ్రీనివాస్ స్పష్టం చేశారు. కరోనా సోకిన వ్యక్తి.. కలిసిన 45 మంది శాంపిల్స్‌లో నెగిటివ్ వచ్చినట్లు ఆయన తెలిపారు. మరో ఇద్దరి శాంపిల్స్ ఫలితాలు.. పూణెలోని నేషనల్ వైరాలజీకి పంపించామనీ.. ఆ రిపోర్టుల ఉదయం వస్తాయని ఆయన వెల్లడించారు. పుకార్లు నమ్మకుండా, మీతో పాటు, మీ చుట్టూ ఉన్న వారిని సురక్షితంగా ఉంచండని ఈ సందర్భంగా హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆస్పత్రుల్లో 3000 మందికి చికిత్స అందించేలా ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నిత్యం పరిశుభ్రంగా ఉండాలనీ.. కరచాలనం చేయకూడదని ఆయన తెలిపారు. ఒక వేళ చేసినా.. వెంటనే హ్యాండ్ వాష్ చేసుకోవాని ఆయన సూచించారు.

సిల్క్ చీరంటే నాకూ మోజూనే

సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభించిన గవర్నర్

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): స్త్రీ తన జీవితంలో చీరకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కళింగ భవన్‌లో సిల్క్ మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ సిల్క్ బోర్డ్, జౌళి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిల్క్ మార్క్ ఇండియా ప్రదర్శనను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చేనేత కార్మికులు తయారు చేసిన సిల్క్ చీరల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. పెళ్లి, వేడుకల సమయంలో సిల్క్ చీరలను ఎక్కువగా ధరిస్తారని గవర్నర్ అన్నారు. చేనేత కార్మికులు ఎంతో శ్రమించి తయారు చేసిన సిల్క్ మార్క్ చీరలను ధరించి వారిని ప్రోత్సహించాలని ఆమె కోరారు. సిల్క్ చీరలంటే తనకు చాలా ఇష్టమని, భారతీయ సంప్రదాయాలను ఎక్కువగా ఇష్టపడతానని చెప్పారు. కొనుగోలు దారులు సిల్క్ చీరల ధరలు చూడవద్దని.. వాటి తయారీ వెనుక కార్మికుల శ్రమను చూసి వాటిని కొనుగోలు చేయాలని గవర్నర్ సూచించారు. ఈ ప్రదర్శన ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కరోనాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

కరోనా అనుమానాలుంటే 104కి కాల్ చేయండి
ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ పరీక్షలకు అనుమతి
మీడియాకు వెల్లడించిన మంత్రి ఈటెల

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎవరికీ కరోనా సోకలేదని అన్నారు. ప్రజలు వందతులు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు సమస్య తీవ్రతను అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. కరోనా వైరస్ గాలి ద్వారా వ్యాపించదని, కరోనా అనుమానాలుంటే 104కి కాల్ చేయాలన్నారు. కరోనా సోకిన వ్యక్తి ఇంట్లోని సభ్యులకు నెగెటివ్ వచ్చిందని చెప్పారు. ఇంట్లో వాళ్లకే వ్యాధి వ్యాపించనప్పుడు ఇతరులకు వచ్చే అవకాశం తక్కువన్నారు. మహేంద్ర హిల్స్‌లో ముందు జాగ్రత్త చర్యగా శానిటేషన్ నిర్వహించినట్లు చెప్పారు. దుబాయ్, ఇటలీ నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో మాత్రమే కరోనా లక్షణాలు కనిపించాయని మంత్రి తెలిపారు. 47 మందికి పరీక్షలు నిర్వహించామని.. 45 మందికి నెగెటివ్ వచ్చిందన్నారు. ఇద్దరు అనుమానితుల శాంపిల్స్ పుణె పంపించామని ఈటల రాజేందర్ తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా కరోనా వైద్యానికి అనుమతి ఇచ్చినట్లు ఈటల రాజేందర్ చెప్పారు. ఐసోలేషన్ వార్డులు ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చామన్నారు. శాంపిల్స్ సేకరణకు ప్రైవేట్ ఆస్పత్రులకు అనుమతి ఉందన్నారు. శాంపిల్స్ ఇచ్చేందుకు గాంధీకి రావాల్సిన అవసరం లేదన్నారు. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు.. వైద్యసేవలు అందించేందుకు ముందుకొచ్చాయని.. కరోనా పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు మంత్రి ఈటల పేర్కొన్నారు. కరోనా వైరస్‌కు మనిషిని చంపే శక్తి లేదని వైద్యులు చెబుతున్నారని, కరోనా సోకిన చాలా మందికి దానంతట అదే తగ్గుతుందని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. 14 శాతం మందికి మాత్రమే వైద్య సేవలు అవసరమవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఇవాళ కరోనా లక్షణాలతో 20 మంది మాత్రమే వచ్చారని, కరోనా పాజిటివ్ వివరాలను మాత్రమే కేంద్రం ప్రకటిస్తుందని మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

సెట్విన్ కేంద్రాల ద్వారా నిరుద్యోగులకు శిక్షణ-మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సెట్విన్ కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతకు స్కిల్‌డెవలఎంట్ శిక్షణ ఇచ్చి వారికిఉపాధితోపాటు ఉద్యోగాలను కల్పిస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జంటనగరాలతోపాటు తెలంగాణ వివిధ జిల్లాల్లో ఏర్పాటుచేసిన శిక్షణా కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ కల్పిస్తున్నామని అన్నారు. సెట్విన్‌కున్న 24 సొంత కేంద్రాలు, 57 ఫ్రాంచైజీల ద్వారా 47 వృత్తినైపుణ్య కోర్సులను శిక్షణ అందించి ఇప్పటికే 4లక్షలకు పైగా యువతకు ఉపాధి కల్పించామన్నారు. బుధవారం సెట్విన్‌సంస్థ నూతనంగా రూపొందించిన కోర్సుల బ్రోచర్‌ను తన అధికారి నివాసంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కరోనాను ఎదుర్కొనేందుకు ప్రత్యేక టీమ్

వైద్యుల బృందంతో టాస్క్‌ఫోర్స్‌టీం ఏర్పాటు
తక్షణమే హైదరాబాద్ తరలించేందుకు ప్రత్యేకంగా అంబులెన్స్

నిజామాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): జిల్లాలో వ్యాధి ప్రభావం అంతగా ఉండబోదని ఒకవేళ వ్యాధి లక్షణాలు బయటపడినా మెరుగైన చికిత్స అందించేందుకు వైద్యుల బృందంతో టాస్క్‌ఫోర్స్‌టీం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. కరోనా వ్యాధి లక్షణాలు ఉన్న రోగి వస్తే తక్షణమే హైదరాబాద్ తరలించేందుకు ప్రత్యేకంగా అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచామని అన్నారు. ప్రత్యేక వైద్యసిబ్బంది, వారికి సూట్‌లు కూడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎక్కువ మొత్తంలో రోగులు వస్తే కూడ ఏర్పాట్లు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. వైద్యులుకూడ అందుబాటులో ఉన్నారు. మరో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుత వాతావరణంలో కరోన వైరస్ ప్రబలే అవకాశం మన వద్ద లేదని అన్నారు.అయినా కరోనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. జనరల్ ఫిజీషియన్, ఉపిరి తిత్తుల వైద్యుడు, చాతి నిపుణుల వంటి వారితో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేశాం. పారామెడికల్ సిబ్బంది, ఇతర సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. 24 గంటలు వైద్య సదుపాయాలు అందిస్తాం. ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డు 20 పడకలతో అందుబాటులో ఉంది. ప్రస్తుతం ఆస్పత్రిలో సపోర్టు మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధికి సంబంధించి లక్షణాలు స్పష్టంగా ఉన్నట్లయితే తాత్కాలిక చికిత్స కోసం సపోర్టు మందులు ఉపయోగించాలి. ఆక్సిజన్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. జలుబు, దగ్గు జ్వరం వంటి లక్షణాలు ఉంటే మొదట పరిశీలించి కరోనాకు చెందిన లక్షణాలు ఉన్నాయా..? పరీక్షిస్తాం అని చెప్పారు. మన వాతావరణంలో కరోనా వైరస్ ప్రబలడానికి వీలులేదు. ఇక్కడ కొత్తగా వ్యాధిరాదు. విదేశాలనుంచి వచ్చిన వ్యాధి నుంచి బయటపడే అవకాశం ఉంది. 98 శాతం వ్యాధి నయం అవుతుంది కేవలం 2శాతం మాత్రమో వ్యాధి రిస్కుగా ఉంటుంది. ప్రజలు భయపడాల్సిన అవసరంలేదు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నిత్యం రెండువేల మంది రోగులు, వారి బంధువుల తాకిడి ఉంటుంది. ఆయా విభాగాల్లో రోగులు ఉంటారు. ఒకరి నుంచి ఒకరికి వ్యాధి సోకకుండా అవగాహన కల్పిస్తున్నాం. కరపత్రాలు వార్డుల్లో అందుబాటులో ఉంచుతున్నాం. వైద్యుల ద్వారా రోగులకు తెలియజేస్తున్నాం. ఆస్పత్రిలో కరోన ప్రబలే అవకాశం తక్కువగా ఉంది. ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డు ఆస్పత్రి వెనుక భాగంలో ఉంది కాబట్టి ఇతర రోగులు వారి బంధువులకు ఇబ్బంది లేదు. అవుట్ పేషెంట్ , ఇన్ పేషెంట్ విభాగాల్లో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. కాని ఇంత వరకు కరోనా లక్షణలతో కూడిన వారు ఎవరు రాలేదు.ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధుల మంజూరు కాలేదు. ఉన్న నిధులతో సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు అదనపు నిధుల అవసరం కూడ లేదు. కరపత్రాల ద్వారా ప్రచారం కరోన వైరస్ పై ప్రచారం చేస్తున్నారు.

కరోనాపై చేతులెత్తేసిన గాంధీ డాక్టర్లు

వందలాదిగా ఆసుపత్రికి క్యూ కట్టిన టెక్కీలు
పరీక్షించలేమని నిస్సహాయత వ్యక్తం చేస్తున్న వైద్యులు

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వుందంటూ పెద్ద సంఖ్యలో వస్తున్న కేసులను పరీక్షించలేమంటూ హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి డాక్టర్లు చేతులెత్తేశారు. గాంధీ ఆస్పత్రిక వందల సంఖ్యలో ప్రజలు క్యూ కట్టడంతో వైద్యులు నిస్సహాయత వ్యక్తం చేశారు. కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, కే. తారక రామారావు ప్రకటించి, 24 గంటలు కాకముందే గాంధీ వైద్యులు ఇబ్బడిముబ్బడిగా రెఫర్ అవుతున్న కేసులను పరీక్షించలేమంటూ అశక్తత వ్యక్తం చేయడం గమనార్హం. దేశంలో ఇప్పటి వరకు 28 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. హైదరాబాద్ సహా పలు నగరాల్లో కరోనా వైరస్ గుర్తింపునకు కేంద్రాలను నెలకొల్పినట్లు వెల్లడించింది.ఇటు వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా కోవిడ్-19 గుర్తింపుతోపాటు.. పాజిటివ్ కేసులకు చికిత్స అందించేందుకు, అనుమానితులను పరీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని ప్రకటించింది. అయితే గ్రౌండ్ లెవెల్‌లో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. బుధవారం ఉదయం నుంచి భారీ సంఖ్యలో క్యూ కట్టిన టెక్కీలతో గాంధీ ఆస్పత్రి కిక్కిరిసిపోయింది. విదేశాలకు ప్రయాణం చేసే వారిలో టెక్కీలే ఎక్కువగా వుండడం, పాజిటివ్ కేసుల్లోను వారి సంఖ్యనే ఎక్కువగా వుండడంతో టెకీలు పెద్ద సంఖ్యలో తమ ఆరోగ్యంపై ఆందోళనతో గాంధీ ఆస్పత్రికి తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో గాంధీ ఆవరణలో పెద్ద పెద్ద క్యూలు దర్శనమిచ్చాయి. మాకు జలుబు, దగ్గు , జ్వరం ఉంది అని మొర పెట్టుకుంటున్న టెకీలను, సామాన్య ప్రజలను అడ్రస్ చేయడంలో గాంధీ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం విదేశాలకు వెళ్ళి వచ్చిన వారికి మాత్రమే పరీక్షలు నిర్వహిస్తామని, మిగిలిన వారికి అక్కర లేదని గాంధీ ఆస్పత్రి వర్గాలు చెబుతూ వారిని తిప్పి పంపుతున్నాయి. గత వారం రోజుల నుండి దగ్గు , జలుబు, తుమ్ములతో ఇబ్బంది పడుతున్న టెకీలు.. తాము విదేశాలకు వెళ్ళకపోయినా.. వెళ్ళి వచ్చిన వారితో కలిసి పని చేశామని చెబుతూ వారికి వైద్య పరీక్షలు నిర్వహించాల్సిందిగా బతిమాలుతుండడం కనిపిస్తోంది. వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాతనే ఆఫీసులకు రావాలని సాఫ్ట్ వేర్ కంపెనీలు తమ సిబ్బందికి చెప్పడంతో వారంతా గాంధీ ఆస్పత్రికి క్యూకట్టారు. అయితే.. ప్రభుత్వం చెబుతున్న దానికి వాస్తవంగా గాంధీ ఆస్పత్రిలో అనుసరిస్తున్న విధానానికి పొంతనే లేదని వైద్య పరీక్షల కోసం వస్తున్నవారు చెబుతున్నారు. ఈ క్రమంలో హెల్త్ ఎమ్జర్గ్÷న్సీ సమయంలో వైద్యుల సంఖ్యతోపాటు.. వైద్య పరీక్షలకు వసతులను గణనీయంగా పెంచాలని కోరుతున్నారు. అయితే.. టెకీలలో అనవసరమైన ఆందోళన రేకెత్తించేలా ఎవరైనా ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ సీపీ సజ్జన్నార్ హెచ్చరించారు. టెకీలలో కరోనా లక్షణాలు లేవని ఆయనంటున్నారు. మరోవైపు.. ఇద్దరు టెకీల శాంపిల్స్‌ని పుణె ల్యాబ్‌కు పంపించామని వైద్యవర్గాలు వెల్లడించాయి.

పబ్‌లో దాడిపై రాహుల్ ఫిర్యాదు

రగంలోకి దిగిన పోలీసులు
ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డిపై అనుమానం

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): గచ్చిబౌలిలోని ప్రిసం పబ్‌లో జరిగిన దాడిపై సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై కొంతమంది వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా తనతో ఉన్న మహిళల పట్ల కూడా దాడి చేసి, అసభ్యంగా ప్రవర్తించారని, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి తనపై దాడి చేసిన వారిని శిక్షించాలని రాహుల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. పబ్‌లో జరిగిన సంఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని రాహుల్ ఫిర్యాదు చేశారు. కాగా ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వీడియో ఆధారంగా కేసు నమోదు చేసినట్లు గచ్చిబౌలి సీఐ శ్రీనివాసులు తెలిపారు. పబ్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 324, 34 రెడ్‌విత్ కేసు రిజిస్టర్ చేశామని చెప్పారు. రాహుల్‌పై దాడి చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని.. పబ్‌లో దాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. సింగర్ రాహుల్ సిప్లిగంజ్ దాడి ఘటనలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాహుల్ సిప్లిగంజ్ తన స్నేహితులు, ఓ స్నేహితురాలితో కలిసి గచ్చిబౌలిలోని ఓ పబ్ కి వెళ్లాడు. అక్కడ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డి స్నేహితుల గ్యాంగ్ రాహుల్ తో వచ్చిన అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించడంతో గొడవ జరిగినట్టు తెలుస్తోంది.అమ్మాయిపై అసభ్యంగా ప్రవర్తించడంపై రాహుల్ నిలదీయడంతో గొడవ మొదలైందని అంటున్నారు. అరగంట పాటు వాగ్వాదం తర్వాత రితీష్ రెడ్డి స్నేహితులు బీర్ బాటిల్స్ తో రాహుల్ పై దాడి చేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ ఘటనపై రాహుల్ పోలీసులకి ఫిర్యాదు చేయలేదు. సుమోటాగా తీసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించడానికి ఇష్టపడటం లేదు.

కరోనా జన్యుక్రమాన్ని గుర్తించాం: ప్రపంచ ఆరోగ్య సంస్థ

హైదరాబాద్, మార్చి 5: కరోనా వైరస్ లేదా కోవిడ్19 వ్యాధికి ఎనిమిది వారాలు నిండాయి. ప్రాణాంతకంగా మారిన కరోనా వైరస్ చైనాలోని వుహాన్ సిటీ నుంచి ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న విషయం తెలిసిందే. ఈ వైరస్‌కు సంబంధించి ఇవాళ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఓ కీలక ప్రకటన చేసింది. కరోనా వైరస్‌కు సంబంధించిన జన్యు క్రమాన్ని(జెనటిక సీక్వెన్స్) గుర్తించినట్లు డబ్ల్యూహెచ్‌వో హెల్త్ ఎమర్జెన్సీ ప్రోగ్రామ్‌లో టెక్నికల్ లీడ్‌గా పనిచేస్తున్న డాక్టర్ మారియా వాన్ కెర్కోవ్ తెలిపారు. ఇవాళ ఈ అంశంపై ఆమె మీడియాతో మాట్లాడారు. వైరస్‌కు సంబంధించిన జెనటిక్ విశ్లేషణ జరుగుతోందన్నారు. పాలీమిరేజ్ చైన్ రియాక్షన్(పీసీఆర్)తో పాటు సీరాలిజికల్ విశ్లేషణను పరిశోధనశాలలో నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. కొత్త వ్యాధిగా రూపాంతరం చెందిన కరోనా వైరస్‌కు సంబంధించి కావాల్సినంత సమాచారం తమ దగ్గర ఉందని కెర్కోవ్ చెప్పారు. వైరస్‌ను అతి తక్కువ సమయంలో గుర్తించడం అసాధారణమైన విషయమన్నారు. వైరస్‌కు చెందిన జన్యు క్రమాన్ని కొన్ని రోజుల క్రితమే షేర్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఇప్పుడు సిరాలాజికల్ అధ్యయనం సాగుతుందన్నారు. చైనాతో పాటు బాధిత ప్రపంచ దేశాలు కరోనా పాజిటివ్ వ్యక్తుల సీరమ్‌ను పరీక్ష చేయవచ్చు అన్నారు.

రోడ్డు ప్రక్కకి దూసుకెళ్లిన సూపర్ లగ్జరీ బస్సు..

సూర్యాపేట, మార్చి 5 : జిల్లాలోని మునగాల వద్ద ప్రమాదం తృటిలో తప్పింది.

ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా తుని నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు మునగాల శివారులో సబ్‌స్టేషన్ ఎదుట అదుపుతప్పి రోడ్డు ప్రక్కకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. ఈ రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

సూర్యాపేట జిల్లా మునగాల వద్ద అదుపుతప్పి దూసుకుని వెళ్లిన లగ్జరీ బస్సు .

చైన్‌స్నాచింగ్ల అరెస్ట్

కడప,మార్చి5(ఆర్ఎన్ఎ): జిల్లాలోని పలు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై గతంలో చిన్నచౌక్ స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదు అయ్యాయి. వీరిలో అప్జల్‌ఖాన్ అనే నిందితుడిపై 2014లో ఎర్రచందనం కేసు ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఇరువురి నుంచి రూ.2.70లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు చోరీకి ఉపయోగించిన స్కూటీనీ సీజ్ చేశారు. దొంగలకు సంబంధించిన వివరాలను కడప డీఎస్పీ సూర్యనారాయణ మీడియాకు వివరించారు.

హోలీ సంబరాలకు దూరం

పార్టీ పరంగా బీజేపీ నిర్ణయం

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): దేశంలో అత్యంత సంబరంగా నిర్వహించుకునే రంగుల పండుగ హోలీపై ఈసారి కరోనా ప్రభావం పడనుంది. భారతీయ జనతాపార్టీ దేశవ్యాప్తంగా పార్టీ తరపున నిర్వహించే హోలీ సంబరాలను ఈసారి నిర్వహించకూడదని నిర్ణయించింది. ఇదే విషయమై అన్ని రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులకు సూచించినట్లు పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా వెల్లడించారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హోలీ సంబరాల్లో పాల్గొనని ప్రకటించిన నేపథ్యంలో మరికొందరు నాయకులు కూడా అదే బాట పడుతున్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా కూడా హోలీలో పాల్గొనని తాజాగా ట్విటర్‌లో పేర్కొన్నారు. ప్రజలు కూడా గుంపులుగా చేరకూడదనని, మీరు, మీ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండేట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలిని సూచించారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 28 కరోనా పాజిటివ్ కేసులు నమోదయినట్లు కేంద్రమంత్రి హర్షవర్ధన్ వెల్లడించారు. ఆగ్రా, రాజస్థాన్, కేరళ, దిల్లీ, తెలంగాణలో కరోనా కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా కారణంగా 3వేల మందికి పైగా మరణించగా, 90వేల మంది కరోనా బారిన పడిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ సారథ్య బాధ్యతలపై రాహుల్ విముఖత

మరోమారు స్పష్టం చేసిన మాజీ అధ్యక్షుడు

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీ నాయకత్వ పగ్గాలను మరోసారి చేపట్టడంపై ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. తాను పార్టీ చీఫ్ పదవికి రాజీనామా చేశానని, మళ్లీ ఆ బాధ్యతలు చేపట్టే ఉద్దేశం లేదని రాహుల్ స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వ బాధ్యతలను తిరిగి రాహుల్ స్వీకరిస్తారన్న ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. నాయకత్వ బాధ్యతను రాహుల్ స్వీకరించే పరిస్థితి లేకపోవడంతో ఈ అంశంపై ఏప్రిల్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో తుది నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. పార్టీ చీఫ్ బాధ్యతలను తిరిగి స్వీకరించాలని పార్టీ ఒత్తిడి తెస్తే ఏమిటన్న ప్రశ్నకు రాహుల్ బదులిస్తే కాంగ్రెస్ అధినేత్రి ఏం నిర్ణయం తీసుకుంటారో చూడాలని అన్నారు. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పరాజయం నేపథ్యంలో కాంగ్రెస్ తాత్కాలిక చీఫ్‌గా సోనియా గాంధీ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. సోనియా ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా చురుకైన పార్టీ చీఫ్ ఉండాలని ఏఐసీసీ యోచిస్తోంది. ముఖ్యంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఆవశ్యకతను సుస్పష్టంగా చాటాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు కాంగ్రెస్ పాలిత మధ్యప్రదేశ్‌లో కమల్ నాథ్ ప్రభుత్వం సైతం కొందరు ఎమ్మెల్యేలు బీజేపీ శిబిరానికి దగ్గరవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో చురుకైన నేత పార్టీ సారథ్య బాధ్యతలు చేపట్టాలని ఏఐసీసీ వర్గాలు భావిస్తున్నాయి. గాంధీ కుటుంబం నుంచే పార్టీ అధినేత ఉండాలన్నది ఆ పార్టీ శ్రేణుల అభిప్రాయంగా ముందుకొస్తోంది.

ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలో 50 బెడ్లతో ఐసోలేషన్ వార్డు

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): నగరంలోని ఎర్రగడ్డలో ఉన్న చెస్ట్ ఆస్పత్రిలో 50 బెడ్లతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ మహబూబ్ ఖాన్ తెలిపారు. ఈ వార్డును వీలైనంత త్వరగా ఏర్పాటు పూర్తిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కరోనా గాలి ద్వారా వ్యాపించే వ్యాధి కాదతీ, చెస్ట్ ఆస్పత్రిలో కరోనా అనుమానితులు ఎవరూ చేరలేదని స్పష్టం చేశారు. ఇక్కడి రోగులను వేరేచోటుకు తరలిస్తామనేది నిజం కాదని, స్పైన్ ఫ్లూ కేసులను ప్రత్యేక వార్డులో ట్రీట్ చేస్తున్నామని మహబూబ్ ఖాన్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు సాయం ట్రాఫిక్ క్లియర్ చేసిన ఎబివిపి విద్యార్థులు

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయి. ఇదిలా ఉంటే ట్రాఫిక్ రద్దీతో విద్యార్థులకు అక్కడక్కడా ఇబ్బందులు తప్పలేదు. రద్దీ ఎక్కువగా ఉండే కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న విద్యార్థులకు ఏబీవీపీ విద్యార్థులు సాయమందించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఏబీవీపీ విద్యార్థులు రంగంలోకి దిగడం విశేషం. తెలంగాణ రాష్ట్ర ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు నిఖిల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేసి.. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవడంలో సాయపడ్డారు. ఏబీవీపీ కృషిని తల్లిదండ్రులతో పాటు ట్రాఫిక్ పోలీసులు అభినందించారు.

కరోనా వైరస్‌పై చైతన్యానికి ఫేస్‌బుక్ నిర్ణయం

ఉచితంగా ప్రకటనలు ఇస్తామన్న సీఈవో మార్క్ జుకర్‌బర్గ్

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): చైనాతో మొదలై ప్రపంచ దేశాలకు విస్తరించిన కరోనావైరస్ కల్లోలానికి ప్రపంచం వణికిపోతోంది. సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ కరోనావైరస్ పై వచ్చే పుకార్లు, తప్పుడు కథనాలు, వదంతులపై యుద్ధం చేయడంలో సాయం చేయనుంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థకోసం ఉచితంగా ప్రకటనలు ఇవ్వనుంది. వినియోగదారులు తప్పుడు సమాచారం బారిన పడకుండా ఈ చర్యలు తీసుకోనుంది. ఈవిషయాన్ని ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

మరోవైపు, ' మేము మిగిలిన వారితో కలిసి ప్రపంచ ఆరోగ్య సంస్థ కోరినన్ని వాణిజ్య ప్రకటనలు ఇచ్చేందుకు సిద్ధం. ఎవరైనా వైరస్‌పై సమాచారం కోసం వెతుకుతుంటే వారికి ఒక పాపప్ వస్తుంది. అది వారిని ప్రపంచ ఆరోగ్య సంస్థ, లేదా స్థానిక వైద్య అధికారుల సూచనలు ఉన్నచోటకి తీసుకెళుతుంది' అని జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. తమ కంపెనీ తప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్ నుంచి తొలగిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన వాటిని తొలగించే ఏర్పాట్లు చేస్తామని మార్క్ చెప్పారు. కాగా.. వైద్యనిపుణులతో కలిసి ఫేస్‌బుక్ పనిచేస్తుందని, యాడ్‌క్రెడిట్స్ రూపంలో ఇతరులకు సహకరిస్తుందన్నారు. కరోనావైరస్ నుంచి రక్షణకు, వ్యాధి తగ్గించేందుకు ఆఫర్ చేసే తప్పుడు వాణిజ్యప్రకటనలను తొలగిస్తామని ఫిబ్రవరిలోనే ఫేస్‌బుక్ ప్రకటించింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 93వేల మందికి ఈ వ్యాధి సోకిన విషయం తెలిసిందే.

భార్య అదృశ్యంతో భర్తకు జైలు

ఏడేళ్ల తర్వాత లవర్‌తో దొరికిపోయిన యువతి

భువనేశ్వర్,మార్చి5(ఆర్ఎన్ఎ): ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలో ఓ ఆశ్చర్యకర సంఘటన చోటుచేసుకుంది. పెళ్లయిన రెండు నెలలకే అదృశ్యమైన మహిళ.. ఏడేళ్ల తర్వాత కనిపించింది. అయితే ఈ కేసులో ఆమె భర్త ఆమెను చంపేశాడన్న కారణంతో నెలరోజులు జైలు జీవితం అనుభవించడం గమనార్హం. ఒడిశా రాష్ట్రంలోని కేంద్రపారా జిల్లాకు చెందిన అభయ్ సుతారా అనే యువకుడికి, అదే ప్రాంతానికి చెందిన ఇతిశ్రీ మొహరానాతో 2013లో వివాహమైంది. పెళ్లయిన రెండు నెలలకే ఇతిశ్రీ ఇంటి నుంచి అదృశ్యమైంది. ఎంత ప్రయత్నించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి ప్రహ్లాద్ తన కూతురిని అల్లుడు అభయ్ వరకట్నం కోసం వేధించి చంపేశాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలులో ఉంచారు. తనకు భార్య అదృశ్యం కావడానికి ఎటువంటి సంబంధం లేదని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. అయితే నెలరోజులు తర్వాత ఆమెకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో అభయ్‌ని బెయిల్‌పై విడుదల చేశారు.

ఎలాగైనా తనమీద ఉన్న హంతకుడు అనే నింద పోగోట్టుకోవాలని.. అప్పటి నుంచి భార్యను వెతకడం ప్రారంభించాడు. ఏడు సంవత్సరాల తర్వాత పూరి జిల్లాలోని పిపిలీ ప్రాంతంలో ఇతిశ్రీ కనిపించింది. దీంతో వెంటనే అభయ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఆమెను వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ.. పెళ్లికి ముందే రాజీవ్ లోచన్ మహారాణా అనే యువకుడిని ప్రేమించానని తల్లిదండ్రులు అతనితో పెళ్లికి ఒప్పుకోకపోవడంతో అభయ్‌ని పెళ్లి చేసుకున్నట్లు తెలిపింది. పెళ్లయిన రెండు నెలలకు రాజీవ్‌తో కలిసి కోల్‌కతా పారిపోయినట్లు తెలిపింది. అయితే అభయ్ మాత్రం హంతకుడు అనే ముద్రను తొలగించుకోవడానికి ఏడు సంవత్సరాలు ప్రయత్నించి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నాడు.

రాచకొండ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై భువనగిరిలో నిర్వహించిన సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభించిన మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, రాచకొండ సీపీ మహేశ్ భగవత్, డీసీపీ నారాయణరెడ్డి ఉన్నారు.

మహిళలు శక్తి స్వరూపిణులు

ఏ పనైనా అవలీలగా చేయగల సమర్థులు
భువనగిరి సదస్సులో మంత్రి సత్యవతి రాథోడ్

యాదాద్రి భువనగిరి,మార్చి5(ఆర్ఎన్ఎ): స్త్రీలు శక్తి స్వరూపిణీలు అని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఏ కార్యాన్నయినా నిర్వహించగల సత్తా వారికుందని అన్నారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై భువనగిరిలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును మంత్రి సత్యవతి రాథోడ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. మహిళలు వారికున్న చట్టాలను తప్పకుండా తెలుసుకోవాలన్నారు. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకువచ్చారని తెలిపారు. సమాజంలో ఉండే లింగ వివక్షత నిజంగా తల్లిదండ్రుల దగ్గరి నుంచే ప్రారంభం అవుతుందన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలకు చెప్పే జాగ్రత్తలను మగపిల్లలకు చెప్పట్లేదు. నిజానికి మహిళలకు అవకాశం ఇస్తే సమాజంలో ఏదైనా చేయగలరు అని పేర్కొన్నారు. దేశంలో తొలిసారి తెలంగాణలో ఆరోగ్యలక్ష్మి పథకం తీసుకొచ్చామని తెలిపారు. యాదగిరిగుట్టలో వృత్తిచారాన్ని పూర్తిగా అరికట్టామని ఆమె స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తామని మంత్రి చెప్పారు. పోలీసు శాఖ నుంచి మహిళలకు పూర్తిగా అండదండలు ఉండాలని మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, రాచొకండ సీపీ మహేశ్ భగవత్, డీసీపీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీలో అంబేద్కర్ విగ్రహ పోరాటం

పంజాగుట్టాలో ప్రతిష్టించాల్సిందే అన్న విహెచ్

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరావు వెంటనే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 14లోగా పంజాగుట్టలో విగ్రహాన్ని ప్రతిష్టించనట్లయితే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎంపీలు, మాజీ ఎంపీలు ధర్నాకు దిగారు. సీనియర్ నేత వీహెచ్ నేతృత్వంలో జరిగిన ఈ ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్,